RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:191 | మంగళవారం | 11 ఆగస్టు 2026 | పేజీలు :8 | వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

PRESS

77309 83966 98491 98098



## వరుణా.. కరుణ చూపవా

- నాగార్జున సాగర్‌లో మహా వరుణ యాగం
- పూర్ణాహుతిలో పాల్గొన్న ముఖ్యమంత్రి దంపతులు
- యాగ క్రతువు ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ దంపతులు
- విజయపురి సౌత్‌లో మార్మోగిన వేద ఘోష
- యాదాద్రి వేదపండితుల ఆధ్వర్యంలో ఒక్క రోజు యాగం సమాప్తం

3





# మరోమారు తెలంగాణకు మొండిచేయి

- పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేం
- రాజ్యసభలో రేణుకాచౌదరి ప్రశ్నకు కేంద్రం సమాధానం

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 10 :**

కేంద్రంలోని మోదీ సర్కార్ తెలంగాణకు మరోసారి మొండిచేయి చూపింది. తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వలేమని చెప్పింది. ఆ ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని తేల్చిచెప్పింది. ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ అప్రైజల్‌ను ప్రస్తుతం చేపట్టలేమని.. కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర అంశాలు ట్రిబ్యునల్ పరిధిలో ఉందని స్పష్టం

మిగతా 3వ పేజీలో..





## నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది పేరు పెడతాం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**నర్సంపేట, ఆగస్ట్ 10 :**

ఎంతకాలం బతికాం అనేది కాదు.. ఎలా బతికామనేదే ముఖ్యమని బీఆర్ఎస్ వర్కింగ్

మిగతా 2వ పేజీలో..



## తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

- రైతులకు సాగునీటి సమస్యను తీర్చండి
- మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ

2

## సాలిడ్-స్టేట్ బ్యాటరీ సాంకేతికతను అభివృద్ధి చేయాలి

- క్వాంటమ్‌స్కేప్ కార్యాలయాన్ని సందర్శించిన డిప్యూటీ సీఎం

**హైదరాబాద్, ప్రజాతంత్ర, ఆగస్టు 10:**

తెలంగాణను అధునాతన తయారీ, స్వచ్ఛ ఇంధన రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చే దిశగా రాష్ట్ర

మిగతా 2వ పేజీలో..



## లాల్‌దర్వాజా మహంకాళి భవిష్యవాణి.. పాపాలు, దారుణాలు పెరిగాయని ఆందోళన

- భక్తుల పూజలతో అమ్మవారు సంతోషించారని ప్రకటన
- పసుపు, కుంకుమలతో ఆరాధిస్తే కోరికలు నెరవేరుతాయని వెల్లడి
- పసిపిల్లలపై దారుణాలు పెరగడంపై ఆందోళన
- రాష్ట్రం, దేశం సుభిక్షం కోసం శాఖ పూజలకు పిలుపు
- ప్రజా సంక్షేమానికి కృషి చేసే ప్రభుత్వాలకు ఆశీస్సులు

2






## మంత్రి పొంగులేటి వర్సెస్ పాడి కౌశిక్‌రెడ్డి

- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రగడ
- మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్‌తో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వాగ్వాదం
- గత ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో వేదికపైనే అభ్యంతరం తెలిపిన ఎమ్మెల్యే
- ప్రభుత్వ వేదికపై రాజకీయాలు వద్దంటూ మంత్రులకు హితవు

2





## ముగిసిన 'సర్' ప్రక్రియ

- రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు

2



## హుస్సేన్‌సాగర్–ప్రకాశం బ్యారేజీ మధ్య సీప్లేన్ సేవలు

- హుస్సేన్‌సాగర్‌లో వాటర్ ఏరోడ్రోమ్ ఏర్పాటుపై సర్వే
- విజయవాడలోనూ త్వరలో ఏఏఐ పరిశీలన
- రేవంత్‌రెడ్డి చొరవతో ప్రతిపాదనకు వేగం
- తెలంగాణ, ఏపీ మధ్య ప్రత్యేక టూరిజం సర్క్యూట్
- ఒక్కో సీ-ప్లేన్‌లో 9 నుంచి 12 మంది ప్రయాణించే అవకాశం

2

## రాంచీలో విద్యార్థుల ర్యాలీ



4

## దేశ కీర్తి పతాకను రెపరెపలాడించారు



4

## బీసీలతోపాటు అన్ని కులాలకు సమానావకాశాలు

- రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉంది
- స్వయం శక్తితో ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న
- సచివాలయం ఎదురుగా మహనీయుల విగ్రహాలు ఏర్పాటు
- పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడి

2





# మంత్రి పొంగులేటి వర్సెస్ పాడి కౌశిక్‌రెడ్డి

**కమలాపూర్, ఆగస్టు 10:**

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం రాజకీయ రగడకు దారితీసింది. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రసంగాల్లో గత ప్రభుత్వంపై చేసిన విమర్శలను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వేదికపైనే తప్పుబట్టారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా.. ఇరువర్గాల కార్యకర్తలు నినాదాలు చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

**గత ప్రభుత్వంపై మంత్రుల విమర్శలు**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవం, లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కోసం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ కమలాపూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా వారు గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలను అసంపూర్తిగా వదిలివేసిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు కేటాయించి పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తున్నామని తెలిపారు.

**వేదికపైనే కౌశిక్‌రెడ్డి అభ్యంతరం**

మంత్రుల వ్యాఖ్యలపై అదే వేదికపై ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమేనని పేర్కొంటూ మంత్రుల వ్యాఖ్యలను తప్పుబట్టారు. వాస్తవాలను మాత్రమే మాట్లాడాలని, ప్రజల కోసం నిర్వహిస్తున్న అధికారిక కార్యక్రమాన్ని రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో గత ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తగదని మంత్రులకు సూచించారు.

**కార్యకర్తల నినాదాలతో ఉద్రిక్తత**

ఎమ్మెల్యే స్పందనతో సభా ప్రాంగణంలో ఉద్రిక్తత పెరిగింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, మద్దతుదారులు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో పరిస్థితి వేడెక్కింది. ఇరువర్గాల మధ్య వాగ్వాదం మరింత ముదరడంతో పోలీసులు వెంటనే జోక్యం చేసుకున్నారు. పరిస్థితి అదుపు తప్పకుండా చర్యలు చేపట్టారు.

**పోలీసుల జోక్యంతో సద్దుమణిగి**

పోలీసులు బీఆర్‌ఎస్ కార్యకర్తలను అక్కడి నుంచి పంపించి వేయడంతో కొద్దిసేపటికి పరిస్థితి అదుపులోకి వచ్చింది. అనంతరం కార్యక్రమాన్ని కొనసాగించారు. కమలాపూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో చోటుచేసుకున్న మంత్రులు, ఎమ్మెల్యే మధ్య వాగ్వాదానికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అధికారిక కార్యక్రమంలో రాజకీయ విమర్శలపై జరిగిన ఈ వివాదం స్థానికంగా చర్చనీయాంశమైంది.



# లాల్‌దర్వాజా మహంకాళి భవిష్యవాణి.. పాపాలు, దారుణాలు పెరిగాయని ఆందోళన

**హైదరాబాద్, ఆగస్టు 10:**

లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రంగం కార్యక్రమంలో మాతంగి అనురాధ అమ్మవారి భవిష్యవాణిని వినిపించారు. భక్తుల పూజలు, నైవేద్యాలతో అమ్మవారు సంతోషించారని, పసుపు, కుంకుమలతో భక్తిశ్రద్ధలతో ఆరాధించే వారికి కోరికలు నెరవేర్చి సుభిక్షంగా కాపాడతానని తెలిపారు. సమాజంలో పాపాలు, అనుకోని విపత్తులు, పసిపిల్లలపై జరుగుతున్న ఘోరాలు పెరిగిపోవడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

**పాపాలు పెరగడంపై ఆందోళన**

తాను శాంతంగా ఉన్నప్పటికీ తనను ఉగ్రరూపంలో చూపిస్తున్నారని మాతంగి అనురాధ పేర్కొన్నారు. కలికాల ప్రభావంతోనే సమాజంలో అనేక దారుణాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. అయితే భక్తి, ధర్మంతో జీవించే వారికి ముక్తి, శక్తి, అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. గ్రామగ్రామాన ఉండి ప్రజలను కాపాడతానని అభయమిచ్చారు.

**ఐదు వారాల పాటు శాఖ పూజలు**

రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండేందుకు ఐదు వారాల పాటు శాఖ పూజలు నిర్వహించాలని భవిష్యవాణిలో సూచించారు. చెడు మార్గంలో నడిచేవారిని, నేరాలకు పాల్పడే వారిని తప్పకుండా శిక్షిస్తానని హెచ్చరించారు. అదే సమయంలో ప్రజా సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వాలకు అమ్మవారి ఆశీస్సులు కొనసాగుతాయని తెలిపారు.

**భక్తులు భయపడొద్దు**

ధర్మబద్ధమైన జీవనం సాగిస్తూ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించే వారు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మాతంగి అనురాధ పేర్కొన్నారు. భక్తులకు ఎల్లప్పుడూ అమ్మవారి రక్షణ ఉంటుందని భరోసా ఇచ్చారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా జరిగిన రంగం కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది పేరు పెడతాం

**మొదటిపేజీ తరువాయి**

ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు సిద్దిపేట ఎమ్మెల్యే, మరో నేత హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమ యాత్రకు లక్షకుపైగా తరలి వచ్చారు.. 12 గంటలపాటు వర్షం పడుతున్నా అంతిమయాత్రలో పాల్గొన్నారు.. ఆయన ఎలాంటి వ్యక్తో తెలిపేందుకు ఇదే నిదర్శనం అన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళుల ర్పిద్దామని కేటీఆర్ అన్నారు.



# సాలిడ్‌స్టేట్ బ్యాటరీ సాంకేతికతను అభివృద్ధి చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక అడుగులు వేస్తున్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆయన సాన్ జోస్‌లోని ప్రసిద్ధ బ్యాటరీ సాంకేతిక సంస్థ 'క్వాంటమ్‌స్కేప్' ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. సంస్థ అధ్యక్షుడు, సీఈఓ డాక్టర్ శివ శివరామ్ సహా ఉన్నతాధికారుల బృందంతో భేటీ అయి, తదుపరి తరం బ్యాటరీ సాంకేతికతలు, గ్లోబల్ సప్లై చైన్ మరియు పెట్టుబడుల అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సాంప్రదాయ లిథియంఅయాన్ బ్యాటరీల కంటే అత్యంత సురక్షితమైన, వేగంగా ఛార్జ్ అయ్యే, ఎక్కువ శక్తి నిల్వ సామర్థ్యం గల 'సాలిడ్‌స్టేట్ లిథియంమెటల్' బ్యాటరీల అభివృద్ధిని డాక్టర్ శివరామ్ ఈ సందర్భంగా ప్రదర్శించారు. ప్రయోగశాల స్థాయి పరిశోధనలను వాణిజ్యపరంగా భారీ స్థాయి తయారీకి తీసుకెళ్లడంలో ఎదురవుతున్న సవాళ్లను, సంస్థ సాధించిన ప్రగతిని డిప్యూటీ సీఎంకు వివరించారు. గ్లోబల్ సప్లై చైన్ - భవిష్యత్ మార్పులు కీలక ఖనిజాల లభ్యత, అధునాతన విడిభాగాల తయారీ, సెల్ మ్యానుఫ్యాక్చరింగ్ మరియు ఎలక్ట్రిక్ వాహనాలలో వీటి వినియోగంపై ఇరు వర్గాలు అభిప్రాయాలు పంచుకున్నాయి. భవిష్యత్తులో ఈ నూతన బ్యాటరీ సాంకేతికతలు గ్లోబల్ సరఫరా గొలుసును ఎలా పునర్నిర్మిస్తాయో, కొత్త భాగస్వామ్యాలకు ఎలా బాటలు వేస్తాయో విశ్లేషించారు.

**తెలంగాణలో పెట్టుబడులకు ఆహ్వానం**

రాష్ట్రంలో శరవేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రిక్ మొబిలిటీ వ్యవస్థ, అత్యుత్తమ ఇంజనీరింగ్ ప్రతిభ, స్వచ్ఛ ఇంధన రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రస్తావించారు. ఆర్ అండ్ డి , విడిభాగాల తయారీ, సరఫరా గొలుసు భాగస్వామ్యాలతో పాటు, భవిష్యత్తులో ఈ సాంకేతికతను భారత్‌లోనే స్థానికీకరించే దిశగా తెలంగాణలో విస్తరణ అవకాశాలను పరిశీలించాలని క్వాంటమ్‌స్కేప్ ప్రతినిధులను కోరారు. అంతర్జాతీయ ఆవిష్కరణల దిగ్గజాలకు, తెలంగాణలో వేగంగా పెరుగుతున్న సాంకేతిక, తయారీ రంగాలకు మధ్య బలమైన అనుసంధానాన్ని ఏర్పరచడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం పర్యటన విజయవంతంగా కొనసాగుతోంది.

**గ్లోబల్ హబ్‌గా తెలంగాణ ఇంధన రంగం**

అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లీలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలోని ఇండియా ఎనర్జీ క్లైమేట్ సెంటర్‌ను భట్టి విక్రమార్క సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో దేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో పాటు తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై లోతుగా చర్చించారు. భారతదేశం నిర్దేశించుకున్న 2030 నాటికి 500 గిగావాట్ల నాన్‌ఫాసిల్ సామర్థ్యాన్ని అందుకునేందుకు అవసరమైన వ్యూహాలు, తగ్గుతున్న శుద్ధ సాంకేతికత ఖర్చులు తెచ్చిపెడుతున్న నూతన అవకాశాలను ఈ సమావేశంలో పరిశీలించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల సమన్వయం, సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన మార్గాలపై పరిశోధకులు, అధికారులతో డిప్యూటీ సీఎం విస్తృతంగా ఆలోచనలు పంచుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన వినూత్న పునరుత్పాదక ఇంధన మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారదర్శకమైన హరిత విధానం ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో సౌరశక్తి సహా ఇతర పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యంగా గ్రాణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టడం, పీఎంకుసుమ్ పథకం ద్వారా అన్నదాతలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతోపాటు క్లీన్ టెక్ పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరును ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా రాష్ట్ర ఇంధన రంగానుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. విద్యుత్, రవాణా, పారిశ్రామిక, వాతావరణ స్థిరత్వ రంగాలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టడం, విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వా న్ని మరింత బలోపేతం చేసేందుకు యూసీ బర్క్లీ ప్రతినిధులతో కలిసి పనిచేయడానికి తెలంగాణ సర్కారు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

# హుస్సేన్‌సాగర్–ప్రకాశం బ్యారేజీ మధ్య సీప్లేన్ సేవలు

**హైదరాబాద్, ఆగస్టు 10:**



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య సీప్లేన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చే ప్రతిపాదన కార్యరూపం దాల్చే దిశగా అడుగులు పడుతున్నాయి. హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజీ వరకు సీప్లేన్ సేవలు ప్రారంభించేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులు హుస్సేన్‌సాగర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశారు. రెండు రాష్ట్రాలను అనుసంధానించే కొత్త పర్యాటక మార్గాన్ని అభివృద్ధి చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.

**రేవంత్‌రెడ్డి చొరవతో**

ఢిల్లీ పర్యటనలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడితో సీప్లేన్ ప్రతిపాదనపై చర్చించినట్లు సమాచారం. హుస్సేన్‌సాగర్-ప్రకాశం బ్యారేజీ మార్గంలో సేవలు అందుబాటులోకి వస్తే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పర్యాటక ప్రాంతాలను అనుసంధానించే ప్రత్యేక సర్క్యూట్ ఏర్పడుతుందని ఇరువురు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. దీంతో ప్రాజెక్టు కార్యాచరణపై కసరత్తు వేగం పుంజుకుంది.

**వాటర్ ఏరోడ్రోమ్‌పై పరిశీలన**

ఏఏఐ ఉన్నతాధికారుల బృందం ఇటీవల హుస్సేన్‌సాగర్‌ను సందర్శించి సీప్లేన్ కార్యకలాపాలకు అనువైన ప్రాంతాలను పరిశీలించింది. విమానాలు నీటిపై సురక్షితంగా దిగడం, టేకాఫ్ కావడానికి అవసరమైన పరిస్థితులతో పాటు నీటి లోతు, ప్రయాణికుల రాకపోకలకు అనుకూలమైన ప్రాంతాలను అధికారులు పరిశీలించినట్లు సమాచారం. సర్వే ఆధారంగా వాటర్ ఏరోడ్రోమ్ ఏర్పాటుకు సంబంధించిన ప్రాథమిక అంచనాలను సిద్ధం చేయనున్నారు.

**ప్రకాశం బ్యారేజీ వద్ద సర్వే**

హుస్సేన్‌సాగర్ పరిశీలన అనంతరం ఏఏఐ అధికారులు విజయవాడ ప్రకాశం బ్యారేజీ ప్రాంతంలోనూ క్షేత్రస్థాయి అధ్యయనం చేయనున్నారు. రెండు ప్రాంతాల్లో సేకరించిన వివరాలను పరిశీలించిన తర్వాత సీప్లేన్ సేవల నిర్వహణకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై నివేదిక రూపొందించే అవకాశం ఉంది. ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలను రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టనున్నాయి.

**రన్‌వే అవసరం లేదు**

సీప్లేన్‌ల ప్రత్యేకత కారణంగా వీటి కోసం సాధారణ విమానాశ్రయాల్లో ఉండే రన్‌వే అవసరం ఉండదు. నీటి ఉపరితలంపైనే దిగడం, అక్కడి నుంచే గాల్లోకి ఎగరడం వీటి విధానం. ఇందుకోసం నీటిపై వాటర్ ఏరోడ్రోమ్‌లను ఏర్పాటు చేస్తారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ఒక్కో సీప్లేన్‌లో 9 నుంచి 12 మంది వరకు ప్రయాణించే అవకాశం ఉంది.

తెలుగు రాష్ట్రాల్లో గతంలో సీప్లేన్‌ల ప్రయోగాత్మక ప్రయాణాలు జరిగినప్పటికీ, ఈసారి క్రమబద్ధమైన సేవలను ప్రారంభించాలన్న లక్ష్యంతో ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. ఏఏఐ తుది నివేదికలో ప్రాజెక్టుకు అనుకూలమైన అంశాలు నిర్ధారణ అయితే తదుపరి అనుమతులు, మౌలిక సదుపాయాల ఏర్పాటుపై చర్యలు చేపట్టే అవకాశం ఉంది. ఈ సేవలు అందుబాటులోకి వస్తే రెండు రాష్ట్రాల మధ్య ప్రయాణంతో పాటు పర్యాటక రంగానికి కూడా కొత్త ఊపునిచ్చే అవకాశముంది.



# తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

**హైదరాబాద్, ఆగస్ట్ 10 :**

తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీష్ రావు లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటలు సాగు కాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని, దానికోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి మోటర్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎల్‌నినో వల్ల తక్కువ వర్షపాతం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఆందోళనలో ఉన్నారు. వానాకాలం పంట సాగుకు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందన్నారు. మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని నింపి ఇంజన్2లోని ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని లేఖలో కోరారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4 లక్షల ఎకరాలు సాగైన విషయం గుర్తించి, ఈ వానాకాలం పంటకు, అదేవిధంగా వచ్చే యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

# ముగిసిన 'సర్' ప్రక్రియ

- **రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది వోటర్లు**

**హైదరాబాద్, ఆగస్ట్ 10:**

రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ (సర్) ప్రక్రియ ముగిసింది. మొత్తం 3,38,26,448 మంది వోటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. 73,95,954 మంది వోటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తయి చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండుసార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. 'సర్' పక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు, 17న ముసాయిదా వోటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజులపాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది వోటర్ల జాబితా విడుదల కానుంది.

# బీసీలతోపాటు అన్ని కులాలకు సమానావకాశాలు

**హైదరాబాద్, ఆగస్ట్ 10:**

బీసీలతోపాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ అన్నారు. సర్వాయి పాపన్న వంటి వీరుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గొప్పతనాన్ని వివరిస్తూ మహేష్ కుమార్ మాట్లాడుతూ ఎంతోమంది రాజులు, చక్రవర్తులు చరిత్రలో ఉన్నప్పటికీ చిన్న జాతిలో పుట్టి పోరాటంతో రాజుగా ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న అని అన్నారు. పుట్టుకతోనే చక్రవర్తులుగా మారిన వారితో పోలిస్తే, పాపన్న పోరాడి రాజయ్యారని పేర్కొన్నారు. మేము రాజులమే.. మేము కూడా పాలించగలుగుతాం అనే ఆత్మవిశ్వాసాన్ని పేద, వెనుకబడిన వర్గాల్లో కల్పించిన గొప్ప వ్యక్తి పాపన్న అని మహేష్ కుమార్ అన్నారు. పేద వర్గాల కోసం పాపన్న పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుల పెద్దలతో చర్చించి సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మహేష్ కుమార్ తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కూడా మాట్లాడినట్లు చెప్పారు. సెక్రటేరియట్ ముందు సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. విగ్రహాలు కేవలం పూలమాలలు వేసేందుకు మాత్రమే కాదని, ఆయా మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగేందుకే విగ్రహాలను ఏర్పాటు చేయాలని మహేష్ కుమార్ అన్నారు. సామాజిక సంస్కర్తలు జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను కూడా ఆవిష్కరించనున్నట్లు మహేష్‌కుమార్ తెలిపారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలు, మహిళలు, పేదల కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాలకతీతంగా రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఎవరు ఎంతో.. వారికి అంత అనేది రాహుల్ నినాదమని తెలిపారు. అదే నినాదంతో తెలంగాణలో కులగణన చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని చెప్పారు. అయితే అసెంబ్లీలో కులగణనకు మద్దతు ఇచ్చిన బీజేపీ.. కేంద్ర స్థాయిలో మాత్రం దానిని అడ్డుకుంటోందని విమర్శించారు. బీసీలు తమ హక్కుల కోసం పోరాడితే కొందరు దానిని ఇతరులకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంగా చిత్రీకరిస్తున్నారని మహేష్‌కుమార్ అన్నారు. మా హక్కుల కోసం మేము పోరాడితే.. మాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని అంటున్నారు. మేము ఎవరికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అన్ని కులాలను కలుపుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ కులం నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని తెలిసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు మద్దతు ఇచ్చారని, కులగణన చేపట్టారని పేర్కొన్నారు. ఎవరినీ ఇబ్బందులకు గురి చేయకుండా అన్ని కులాలను కలుపుకుని సమాన అవకాశాలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మంత్రిగా ఉన్న సమయంలో శ్రీనివాస్ గౌడ్ పార్టీలకు అతీతంగా బీసీల కోసం, కులాల సంక్షేమం కోసం పనిచేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీలతో పాటు ఇతర కులాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని రాహుల్ గాంధీ సూచించారని తెలిపారు. ఈ క్రమంలో పార్టీ పదవుల్లో కూడా సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. 79 శాతం ఉపాధ్యక్ష పదవులను బీసీలకు ఇచ్చామని, అదే సమయంలో అన్ని కులాలకు సమానంగా అవకాశాలు కల్పించామని మహేష్ కుమార్ వెల్లడించారు. కులాల హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం లభించేలా ముందుకు సాగడమే లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు.

# వరుణా.. కరుణ చూపవా

**నాగార్జునసాగర్, ఆగస్టు 10 :**

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని దేవీదేవతలను వేడుకుంటూ ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం వేదపండితుల మంత్రోచ్చారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో సంపూర్ణమైంది. నాగార్జునసాగర్ తీరంలోని విజయ విహార్ వద్ద కృష్ణా నది ఒడ్డున సోమవారం బ్రహ్మముహూర్తంలో మహా వరుణ యాగం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని రుత్వికుల మార్గదర్శకత్వంలో సాయంత్రం ఈ పవిత్ర వరుణ యాగంలో పూర్ణాహుతి సమర్పించారు. దీంతో యాగం సమాప్తమైంది. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, కృష్ణాగోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, జలాశయాలు నిండాలని, రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరియాలని సంకల్పిస్తూ వేకువ జామునే 108 మంది రుత్వికులు, వేదపండితులు, అర్చకులు ఈ మహా క్రతువులో భాగస్వాములయ్యారు. ఋత్వికులు గోపూజ, ఋష్యశృంగ పూజ, యాగశాల ప్రవేశం చేయించగా నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన సతీమణి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతితో కలిసి యాగ క్రతువులో పాల్గొన్నారు. దివ్యమైన ఆధ్యాత్మిక వాతావరణంలో కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలన్న సంకల్పంతో ఈ వరుణ యాగం నిర్వహించామని తెలిపారు. ఒకవైపు శాస్త్రీయ అంచనాలు, ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళ్తూనే వర్షం, వ్యవసాయం, ప్రకృతి, మానవ జీవితం పరస్పర సంబంధాన్ని ప్రతిబింబించే సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రకృతి అనుగ్రహించాలని వేడుకున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో ఈసారి వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ మహా వరుణయాగాన్ని నిర్వహించింది. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలి.. కృష్ణా గోదావరి నదులు నిండుగా ప్రవహించాలి.. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లతో పాటు అన్ని ప్రాజెక్టులు నిండాలి.. రాష్ట్రంలోని ప్రతి చెరువు, ప్రతి కుంట జలకళతో కళకళలాడాలి.. భూగర్భ జలాలు పెరగాలి.. పంటలు పుష్కలంగా పండాలి.. రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాలి.. రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలి' అని ముఖ్యమంత్రి వరుణ దేవుడిని ప్రార్థించారు. ఈ యాగంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, పి.సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**క్రతువు ఆరంభించిన మంత్రి ఉత్తమ్ దంపతులు**

సూర్యకిరణాలు కృష్ణమ్మ జలాలను తాకక ముందే నాగార్జునసాగర్ పరిసరాల్లో నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ వేదమంత్రాలు మార్మోగాయి. వర్షాలకు అధిదేవత అయిన వరుణుడి కరుణ తెలంగాణపై ప్రసరించాలని కోరుతూ రుత్వికులు చేసిన మంత్రోచ్చారణలతో కృష్ణాతీరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఋగ్, యజుర్వేద, సామవేద, అథర్వణ వేదాలను వేదపండితులు పారాయణం చేస్తూ క్రతువును ప్రారంభించారు. ప్రధాన యాగ క్రతువు కోసం 32మంది రుత్వికులు యాగశాలలో నిర్దేశించిన స్థానాల్లో ఆశీనులు కాగా మిగిలిన రుత్వికులు నిరంతర వేదపారాయణం, జపంలో పాల్గొన్నారు. చతుర్వేద పారాయణం అనంతరం 11 హోమకుండాల్లో అగ్నిని ప్రజ్వలింపజేసి వరుణ దేవుడిని ఆవాహన చేస్తూ హోమాలు నిర్వహించారు. ఆకాశంజలంభూమిమానవాళి మధ్య సమతుల్యత నెలకొనాలని ఆకాంక్షిస్తూ వేదమంత్రాల నడుమ హోమద్రవ్యాలను అగ్నికి సమర్పించారు.



ఒకవైపు కృష్ణమ్మ విశాల జలరాశి, మరోవైపు హోమకుండాల్లో ఎగసిపడుతున్న అగ్నిజ్వాలలు.. వాటి మధ్య ప్రతిధ్వనించిన వేదఘోషతో సాగర్ తీరం భక్తిభావంతో నిండిపోయింది.

**విజయపురికి వరుణారాధనతో ప్రాచీన అనుబంధం**

వరుణ యాగం నిర్వహించిన ఈ ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యం కూడా ఉందని యాగ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ప్రాచీన కాలంలోనే వరుణారాధన జరిగినట్లు చారిత్రక ఆధారాలున్నాయని వేదపండితులు వివరించారు. వరుణుడితో సంబంధం ఉన్న ఒక ప్రాచీన ప్రతిమ ప్రస్తుతం నల్లగొండ మ్యూజియంలో భద్రపరిచి ఉందని పేర్కొన్నారు. ఈ చారిత్రక నేపథ్యం కారణంగా ప్రస్తుతం జరుగుతున్న మహా వరుణ యాగానికి మరింత ఆధ్యాత్మిక విశిష్టత చేకూరిందని తెలిపారు. శతాబ్దాల కిందట జలాల కోసం ఇదే నేలపై వినిపించిన వరుణ ప్రార్థన ఇప్పుడు మరోసారి కృష్ణమ్మ ఒడ్డున వేదఘోషగా ప్రతిధ్వనించడం యాగానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు ఆచార్య వెంకటాచార్యులు, నరేష్ శర్మ, వెంకటరామశర్మ, ఆదిత్య శర్మతోపాటు పలువురు వేద పండితులు యాగ క్రతువును నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా, సమానంగా వర్షాలు కురవాలని రుత్వికులు ప్రార్థించారు. అంతేకాక కృష్ణా, గోదావరి నదుల ఎగువ పరీవాహక ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రల్లో కూడా విస్తారంగా వర్షాలు కురవాలని, తద్వారా రెండు మహానదులకు నిరంతర ప్రవాహాలు వచ్చి తెలంగాణ జలాశయాలు నిండాలని సంకల్పించారు. చెరువులు కళకళలాడాలని, భూగర్భ జలాలు పెరగాలని, ఖరీఫ్ పంటలకు నీటి కొరత రాకూడదని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని వరుణ దేవుడిని ప్రార్థించారు. ప్రస్తుత సీజన్‌లో వర్షపాతం అన్ని ప్రాంతాల్లో ఒకే విధంగా లేకపోవడం, రానున్న రోజుల్లో వర్షాల తీరుపై నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఈ ఆధ్యాత్మిక ప్రార్థనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఒకవైపు ఇంజినీర్లు జలాశయాల్లో నీటి నిల్వలు, నదుల్లో ప్రవాహాలు, సాగునీటి అవసరాలను నిరంతరం పరిశీలిస్తుంటే మరోవైపు ఆ జలాలన్నింటికీ మూలమైన ఆకాశం వైపు విజయపురి నుంచి వేదమంత్రాలతో ప్రార్థనలు సాగాయి. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మహా వరుణ యాగం రోజంతా కొనసాగింది. ఉదయం నుంచి విజయపురిలో కనిపించిన దృశ్యం అపూర్వం. భాష వేల ఏళ్లనాటిది కావచ్చు కానీ ఆ మంత్రాల వెనుక ఉన్న ఆకాంక్ష మాత్రం వరుణుడు కరుణించాలని, తెలంగాణ నేలపై సమృద్ధిగా వర్షాలు కురవాలని, కృష్ణాగోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, చెరువులు, జలాశయాలు నిండాలని, ఆకాశం వైపు చూసే అన్నదాత కళ్లలో ఆశ కనిపించాలన్నది మహా వరుణ యాగం సంకల్పమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. యాగ క్రతువులో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, యాదగిరిగుట్ట ఈవో భవాని శంకర్, డిప్యూటీ ఈవో, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రైతుకు అండ.. అదే మా ధ్యేయం

- **ఆర్థికంగా అనుకూలించకున్నా రైతు సంక్షేమానికి ప్రాధాన్యం**
- **మాట ప్రకారం ధరణిని బంగాళాఖాతంలో కలిపాం**
- **హన్మకొండలో రైతు మేళాలో రెవెన్యూ మంత్రి పొంగులేటి**

**హనుమకొండ, ఆగస్టు 10:**

రైతును రాజుగా చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి రైతు మేళాను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాక□ర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.ఆర్.నాగరాజుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. 'ధరణి'ని బంగాళాఖాతంలో వేస్తామని ఇచ్చిన మాట ప్రకారం బంగాళాఖాతంలో వేశాం.. రైతుల భూములకు శాశ్వత భద్రత కల్పించే భూభారతిని తీసుకొచ్చాం అని మంత్రి పొంగులేటి అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి వ్యవస్థతో రైతులు, భూయజమానులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని, భూ హక్కుల విషయంలో ఏర్పడిన గందరగోళానికి శాశ్వత పరిష్కారం చూపించాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై పడిందని అన్నారు. రైతు భూమి రైతుదే అనే భరోసా కల్పించడమే భూభారతి ప్రధాన ఉద్దేశమని, భూ రికార్డులను ప్రక్షాళన చేసి పారదర్శకంగా హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. భూములపై స్పష్టమైన హక్కులు, రికార్డులు, మ్యాప్‌లు అందుబాటులో ఉంటే భవిష్యత్తులో భూ వివాదాలు, ఆక్రమణలకు అవకాశం ఉండదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాక రైతు, భూ యజమాని భవిష్యత్ తరాలకు భద్రత కల్పించాలనే చిత్తశుద్ధితో భూభారతి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. గత పదేళ్లలో రైతులు, భూ యజమానులు ఎదుర్కొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతు సంక్షేమం విషయంలో మాటలు చెప్పడం కాదు.. బడ్జెట్‌లో నిధులు పెంచి రైతుకు ఆర్థిక భరోసా కల్పించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం నెలకు సగటున రూ.5,250 కోట్లు వివిధ రూపాల్లో ఖర్చు చేస్తోందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని అంగీకరించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో గోదాములు, నిల్వ సామర్థ్యం పెంచకపోవడం వల్ల ఏర్పడిన లోటును తమ ప్రభుత్వం అధిగమిస్తోందన్నారు. రైతును రాజకీయాలకు ఉపయోగించుకోవడం కాదు.. రైతుకు అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాలని, తక్కువ నీటితో మంచి దిగుబడి, ఆదాయం అందించే పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. శాస్త్రవేత్తల సూచనలు ఒకవైపు, రైతుల అనుభవం మరోవైపు.. రెండింటినీ సమన్వయం చేసుకుంటే వ్యవసాయంలో మరిన్ని మంచి ఫలితాలు సాధించవచ్చని మంత్రి పేర్కొన్నారు.

**ప్రతీ పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు**

అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి సొంతింటిని అందించి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి అన్నారు. పేదల సంక్షేమానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం వెనుకడుగు వేయకుండా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని మూడు గ్రామాల్లో సుమారు 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇది ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వమని, పేదల కష్టాలు, బాధలు తీర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. పేదల గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలను చేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 వేల అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసే కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే మొదటి దశలో 4.5 లక్షల ఇళ్లను, రెండో దశలో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియ చేపట్టామని మంత్రి తెలిపారు. మూడో, నాలుగో దశల్లోనూ ఇళ్లను మంజూరు చేస్తామని, ప్రతిపేద కుటుంబానికి సొంతింటిని అందించే వరకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఇళ్ల కేటాయింపులో ఎలాంటి పక్షపాతం చూపడం లేకుండా ముఖ్యమంత్రి నియోజకవర్గం, మంత్రుల నియోజకవర్గాలతోపాటు ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు కూడా అర్హత ఆధారంగా ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. పేదోడు ఏ కులం, ఏ మతం, ఏ పార్టీకి చెందినవాడన్నది కాక అర్హతే ప్రామాణికంగా ఇళ్లను అందిస్తున్నామన్నారు. నిర్మాణం ఏ దశలో ఉందో పరిశీలించి నిబంధనల ప్రకారం తదుపరి విడత నిధులను విడుదల చేస్తామని తెలిపారు. కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా లబ్దిదారుల ఖాతాల్లోకి నిధులు చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. లబ్దిదారుల కాలనీల్లో అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో పేదలకు పరిమిత సంఖ్యలో ఇళ్లు అందించిన పరిస్థితికి భిన్నంగా ప్రజా ప్రభుత్వం దశలవారీగా సుమారు ఎనిమిది లక్షల ఇళ్లను ఇప్పటివరకు మంజూరు చేసి పేదలకు అందించే దిశగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇళ్లు.. పేదల ముఖాల్లో సంతోషం చూడటమే అని స్పష్టం చేశారు. కమలాపూర్ మండలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందుకుంటున్న లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి అర్హులైన లబ్దిదారులకు రెండు పడక గదుల ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

# మత్స్యకారుల సామాజిక భద్రతకు ప్రాధాన్యత

- **ప్రమాదవశాత్తు మరణం, వికలాంగతకు రూ.5 లక్షల వరకు బీమా**
- **మత్స్య, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి శ్రీహరి**

**హైదరాబాద్, ఆగస్టు 10 :**

రాష్ట్రంలోని 4,21,767మంది నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం (జీపీఐఎస్) అమలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని పశు సంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసుల, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధి భద్రత, సామాజిక రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యానికి గురైన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. 202627లో 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల 4,21,767 మంది నమోదిత మత్స్యకారులు ఈ పథకం పరిధిలోకి వస్తారని మంత్రి వెల్లడించారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.79.96 బీమా ప్రీమియం ఉండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో ప్రీమియం భరిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.21,34,79,673 చెల్లిస్తుందని, తద్వారా అర్హులైన మత్స్యకారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు. బీమా పథకం ద్వారా అందే ప్రయోజనాలు ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.5.00 లక్షలు, శాశ్వత సంపూర్ణ వైకల్యానికి రూ.5.00 లక్షలు, శాశ్వత పాక్షిక వైకల్యానికి రూ.2.50 లక్షలు, ప్రమాదవశాత్తు హాస్పిటల్‌లో చికిత్స పొందితే గరిష్ఠంగా రూ.25,000 వరకు వైద్య సహాయం 2026 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ పాలసీ కాలంలో అర్హులైన ప్రతి నమోదిత మత్స్యకారుడికి నిరంతర బీమా రక్షణ అందేలా మత్స్య శాఖ అన్ని చర్యలు చేపట్టిందని మంత్రి వాకిటి తెలిపారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రమాద సమయంలో అండగా నిలవడంతోపాటు వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం కీలకమైనదన్నారు.



## మరోమారు తెలంగాణకు మొండిచేయి

**మొదటిపేజీ తరువాయి**

చేసింది. తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో రావాలంటూ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ డీపీఆర్‌ను కేంద్రం తిరిగిన వెనక్కి పంపింది. ప్రాజెక్టుకు కేంద్ర సాయం విషయంలోనూ తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. ప్రస్తుతం జరుగుతోన్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి రాజ్యసభలో పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ జాతీయ హోదా గురించి ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎంపీ రేణుకా చౌదరి ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం కేంద్రం పరిశీలనలో లేదని స్పష్టం చేశారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ 2 పరిధిలో అంతరాష్ట్ర అంశాలు ఉండటంతో టెక్నోఎకనామిక్ అప్రైజల్ సాధ్యం కాదని, సమగ్ర ప్రణాళికతో డీపీఆర్‌ను మళ్లీ సమర్పించాలని సూచించారు. ప్రాజెక్టుకు సాయం విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు. అంతేకాకుండా, ప్రాజెక్టుకు కేంద్ర నిధుల సాయం అందించే విషయంలోనూ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. జాతీయ ప్రాజెక్టు హోదా అనేది ప్రధానంగా జాతీయ ప్రాధాన్యం, అంతరాష్ట్ర లేదా అంతర్జాతీయ జల వివాదాలు లేకపోవడం , గణనీయమైన సాగునీటి సామర్థ్యం ఆధారంగా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారమే ఇస్తామని కేంద్రం పునరుద్ఘాటించింది. కృష్ణా జలాలపై క్లియరెన్సులు, ట్రిబ్యునల్ పరిధిలోని అంశాలు తేలితే తప్ప ఈ ప్రాజెక్టు హోదాపై తదుపరి నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని కేంద్రం తేల్చిచెప్పింది.



## సమ్మక్క, సారక్కలకు మంత్రి సీతక్క పూజలు

- **అభివృద్ధి పనుల పరిశీలన**

**తాడ్వాయి, ఆగస్టు 10 :**

తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి అనసూయ ఆలయ పీటీ బీమ్స్, క్యూ లైన్లు, మీడియా టవర్లు, గ్రానైట్ పనులతోపాటు ఆలయ ప్రాంగణం వెనుక భాగంలో ఏర్పాటు చేయనున్న నూతన క్యూ లైన్ ఏర్పాటు అంశాలను పరిశీలించారు. ఈవో కార్యాలయ పరిసరాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్ జీ, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, డీపీఓ వెంకయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఆలయ ఈవో, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## 'ఇందిరమ్మ ఇండ్లు టవర్స్'కు గడువు పొడిగింపు

- **15 వరకు దరఖాస్తుల స్వీకరణ**
- **ఇప్పటివరకు 46,121 దరఖాస్తులు**
- **గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, ఆగస్టు 10:**

హైదరాబాద్ క్యూర్ పరిధిలోని ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకానికి దరఖాస్తుల స్వీకరణ గడువును మరో ఐదు రోజులపాటు పొడిగిస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చి నామమాత్రపు ధరలోనే పేద, మధ్యతరగతి ప్రజలకు సొంత ఇంటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పథకం కింద లక్ష ఇళ్లను నిర్మిస్తున్నామని, అందులో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా 16 నియోజకవర్గాల్లో 7,340 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని ఆయన వివరించారు. ఈ 'టవర్స్'కు ప్రజల్లో విశేష స్పందన లభిస్తోందని, పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయని పేర్కొన్నారు. అయితే రెండో శనివారం, బోనాల పండగ తదితర వరుస సెలవుల కారణంగా దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించాలంటూ వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణ గడువును మరో ఐదు రోజులపాటు పొడిగించినట్లు వెల్లడించారు. తొలుత ప్రకటించిన ప్రకారం దరఖాస్తుల స్వీకరణ గడువు 10వ తేదీ వరకు ఉంది. గత నెల 21 నుంచి మీసేవ కేంద్రాలతోపాటు ఆన్‌లైన్ ద్వారా, మీసేవ వాట్సాప్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. సోమవారం సాయంత్రం నాటికి మొత్తం 46,121 దరఖాస్తులు అందినట్లు మంత్రి తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచినప్పటికీ దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ, కేటాయింపు, లాటరీ తదితర ప్రక్రియల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. నెలాఖరు నాటికి ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్ల కేటాయింపు ప్రక్రియపై దరఖాస్తుదారులు ఎలాంటి అపోహలు, అనుమానాలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు.



# రాంచీలో విద్యార్థుల ర్యాలీ

- **అసెంబ్లీ వద్ద లాఠీచార్జి**

**రాంచీ, ఆగస్టు 10 :**
ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(జేపీఎస్సీ) పేపర్ లీక్ ఉదంతంపై విద్యార్థుల నిరసనలు తీవ్రమయ్యాయి. ఈ విషయంలో ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో విద్యార్థులు అసెంబ్లీ వరకూ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి వేలాదిగా విద్యార్థులు రాజధాని రాంచీకి తరలివచ్చారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించాల్సిందేనంటూ విద్యార్థులు నినదించారు. ప్రభుత్వం శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అనేక జాగ్రత్తలు తీసుకుంది. పలు కూడళ్లు, రహదారులపై బ్యారికేడ్లను ఏర్పాటు చేసి సున్నిత పరిస్థితులున్న ప్రాంతంలో పోలీసులను భారీగా మోహరించింది. సోమవారం స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. పరీక్షల్లో అక్రమాలపై నిరసన తెలుపుతున్న ఉద్యోగార్థులు జార్ఖండ్ అసెంబ్లీ సమీపంలోని బ్యారికేడ్లను దాటడానికి సోమవారం ప్రయత్నించగా పోలీసులు వాటర్ కెనన్‌లు, బాష్పవాయువు ప్రయోగించి లాఠీఛార్జి చేశారు. పరీక్షల్లో అక్రమాలకు వ్యతిరేకంగా తొమ్మిది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జార్ఖండ్ లోక్‌తాంత్రిక్ క్రాంతికారి మోర్చా నాయకుడు దేవేంద్ర నాథ్ మహ్తో 10.5 కిలోల బరువు తగ్గినప్పటికీ ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ చిత్రాన్ని చేతబూని కనిపించారు. కాగా, నియామక పరీక్షల్లో అక్రమాల ఆరోపణలపై జేపీఎస్సీ మాజీ చైర్మన్‌ను జార్ఖండ్ సీఐడీ అరెస్టు చేసింది. జూలై 28 నుండి ఆయనను నాలుగుసార్లు విచారించారు.

# రూ.2,000 కోట్ల చిట్‌ఫండ్ మోసం.. ఈడీ సోదాలు

- **వెల్ఫేర్ బిల్డింగ్స్ కేసులో రూ.1.01 కోట్ల నగదు, ఆస్తి పత్రాల స్వాధీనం**
- **విశాఖ, హైదరాబాద్ సహా ఐదు ప్రాంతాల్లో తనిఖీలు**
- **సంస్థకు చెందిన 182 బ్యాంకు ఖాతాలు స్తంభింపు**
- **ఆరు విలాసవంతమైన వాహనాలు సీజ్**
- **పలురాష్ట్రాల్లో వేలాది మంది నుంచి నిధుల సమీకరణ**
- **పీఎంఎల్‌ఏ కింద దర్యాప్తు ముమ్మరం**

**హైదరాబాద్, ఆగస్టు 10:**
తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన బహుకోట్ల చిట్‌ఫండ్, రియల్ ఎస్టేట్ మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. వెల్ఫేర్ బిల్డింగ్స్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన కార్యాలయాలు, సంస్థ డైరెక్టర్లు మల్ల విజయ ప్రసాద్, వరహ రామకృష్ణ సత్య శ్రీనివాసరావు అల్లా నివాసాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. విశాఖపట్నం, హైదరాబాద్ సహా ఐదు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో రూ.1.01 కోట్ల నగదు, కీలక ఆస్తి పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. సంస్థకు సంబంధించిన 182 బ్యాంకు ఖాతాలతో పాటు ఆరు విలాసవంతమైన వాహనాలను స్తంభింపజేశారు.

**రూ.2 వేల కోట్లకు పైగా సమీకరణ**
రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, డిపాజిట్ పథకాల పేరుతో సంస్థ భారీగా నిధులు సేకరించినట్లు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది నుంచి రూ.2,000 కోట్లకు పైగా సమీకరించినట్లు అధికారులు గుర్తించారు. విశాఖపట్నంలో భూములు అందిస్తామని నమ్మించి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది.

**పాత పెట్టుబడిదారులకు కొత్త నిధులతో చెల్లింపులు**
పెట్టుబడులు సేకరించిన అనంతరం పలు ప్రాంతాల్లోని బ్రాంచ్ కార్యాలయాలను మూసివేసి సంస్థ కార్యకలాపాలను నిలిపివేసినట్లు అధికారులు గుర్తించారు. కొత్తగా వచ్చిన పెట్టుబడిదారుల సొమ్ముతో గతంలో డబ్బులు పెట్టిన వారికి చెల్లింపులు చేస్తూ, మిగిలిన నిధులను వ్యక్తిగత ప్రయోజనాలకు మళ్లించినట్లు ఈడీ అనుమానిస్తోంది.

**పీఎంఎల్‌ఏ కింద కేసు**
మోసానికి సంబంధించి వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ పీఎంఎల్ఏ కింద కేసు నమోదు చేసింది. సోదాల్లో లభించిన పత్రాలు, డిజిటల్ ఆధారాలు, బ్యాంకు లావాదేవీలను అధికారులు పరిశీలిస్తున్నారు. నిధుల ప్రవాహం, ఆస్తుల కొనుగోళ్లు, పెట్టుబడిదారుల నుంచి సేకరించిన మొత్తాల వినియోగంపై దర్యాప్తు కొనసాగుతోంది.

# కొలంబియాలో భారీ భూకంపం.. 47 మంది మృతి

**బొగోటా, ఆగస్టు 10**
పశ్చిమ కొలంబియాలో సోమవారం సంభవించిన 7.4 తీవ్రతతో కూడిన భారీ భూకంపం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనలో కనీసం 47 మంది మృతి చెందినట్లు అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) వెల్లడించింది. ప్రకంపనల ధాటికి పలు ప్రాంతాల్లో భవనాలు కుప్పకూలగా, శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు సమాచారం. భయాందోళనలకు గురైన వేలాది మంది ఇళ్ల నుంచి బయటకు వచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు.

**శాన్ జోస్ డెల్ పాల్మర్ వద్ద కేంద్రం**
చోకో ప్రాంతంలోని శాన్ జోస్ డెల్ పాల్మర్ సమీపంలో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. బొగోటాకు సుమారు 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో దాదాపు 4,800 మంది నివసిస్తున్నారు. భూమికి 107 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు సంభవించినట్లు అమెరికా భూగర్భ సర్వే సంస్థ వెల్లడించింది. పొరుగున ఉన్న ఈక్వెడార్‌లోనూ భూకంప ప్రభావం కనిపించింది. పెరీరా నగరంలో 18 మంది మృతి చెందినట్లు మేయర్ మౌరిసియో సలాజర్ తెలిపారు.

**కూలిన చర్చి టవర్**
పెరీరా, కాళీ, క్విబ్డో నగరాల్లో పలు ఇళ్లు, చిన్న భవనాలు దెబ్బతిన్నాయి. మానిజాలెస్‌లోని చారిత్రక నియోగోథిక్ కేథడ్రల్ టవర్ ప్రకంపనల ధాటికి కూలిపోయింది. భవనాల్లో చిక్కుకున్న వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

**ఆరు విమానాశ్రయాల్లో సేవలు నిలిపివేత**
భూకంపం కారణంగా పెరీరా, మానిజాలెస్, క్విబ్డో, అర్మేనియా, కార్టాగో, బ్యూనవెంచురా నగరాల్లోని ఆరు విమానాశ్రయాల కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. మౌలిక వసతుల భద్రతను పరిశీలించే వరకు విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు పౌర విమానయాన సంస్థ తెలిపింది. సహాయక చర్యలు ముమ్మరం విపత్తు నేపథ్యంలో కొలంబియా ప్రభుత్వం సహాయక చర్యలను వేగవంతం చేసింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షుడు అబెలార్డో దే లా ఎస్ప్రియెల్లా శాన్ జోస్ డెల్ పాల్మర్‌లో పరిస్థితిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

# దేశ కీర్తి పతాకను రెపరెపలాడించారు

- **కామన్‌వెల్త్ క్రీడాకారులకు ప్రధాని మోదీ అభినందనలు**



న్యూఢిల్లీ, ఆగస్టు 10 : దేశ కీర్తిపతాకను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన క్రీడాకారులను ప్రధాని మోదీ అభినందించారు. వి□ గెలుపు వి□కే కాదు దేశానికీ గర్వకారణమని వారిని ప్రశంసించారు. భారత బాక్సర్ లవ్లీనాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లు ఆదివారం ప్రధానిని కలవగా వారితో సరదాగా మాట్లాడిన మోదీ అథ్లెట్లకు లడ్డూలు తినిపించారు. ఈ సందర్భంగా బాక్సర్ లవ్లీనా గ్లాస్గోలో చేసిన పనిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ఆ రెస్టారెంటులో ఏం జరిగిందని మోదీ ప్రశ్నించగా 'కామన్వెల్త్ గేమ్స్‌లో మంచి ప్రదర్శన చేశాం.. అది చివరి రోజు.. చాలా సంతోషంగా గడపాల్సిన సందర్భం.. అందుకోసం ఓ రెస్టారెంటుకు వెళ్లాం. అక్కడ హ్యాండ్ టవల్స్‌పై మన దేశ మ్యాప్ సరిగా లేదనిపించింది.. ఇదే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లా.. మార్పులు చేస్తామని చెప్పార'ని ఆమె తెలిపింది. ఈశాన్య రాష్ట్రాలతోపాటు కశ్మీర్ పూర్తి భూభాగాలను ఆ చిత్రపటంలో చూపకపోవడంతో సోషల్ వి□డియా వేదికగా లవ్లీనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత రెస్టారెంట్ క్షమాపణలు చెబుతూ ఓ ప్రకటనను జారీ చేసింది. సంబరాలు చేసుకుంటున్న సమయంలో వి□రు మ్యాప్ ప్రాముఖ్యతను గుర్తించడం నిజంగా అభినందనీయం అని మోదీ అన్నారు. ఆ వీడియో సాధారణమైంది కాదు.. దేశ ప్రజలు సుదీర్ఘకాలం గుర్తుంచుకుంటారన్నారు. ఇది కావాలనే చేసిందని.. పొరపాటు కాదని అభిమానులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మరో బాక్సర్ నరేంద్ర బేర్వాల్ గతంలో తనకు పాక్ బాక్సర్‌తో ఎదురైన అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. 'పాకిస్థాన్ గురించి ఏం మాట్లాడినా నాకొక స్టోరీ గుర్తుకొస్తుంది సర్. అది 2015 మిలిటరీ గేమ్స్.. నా ఫస్ట్ ఫైట్ పాక్ బాక్సర్‌తో.. అప్పుడు ఉన్నతాధికారులు, సహచరులు ఒకటే చెప్పేవారు.. పాక్ బాక్సర్ చేతిలో మాత్రం ఓడిపోవద్దు.. ఆ మ్యాచ్‌లో వరుసగా రెండు రౌండ్లలో నేనే గెలిచా.. వి□రు 2014లో ప్రధానిగా వచ్చారు.. మా ఆర్మీ కోచ్ పేరు నరేందర్ రాణా.. దానిని ఉద్దేశిస్తూ పాక్ బాక్సర్ 'బ్రదర్ నీతో ఓ విషయం చెప్పాలనుకుంటున్నా.. నీ పేరు నరేందర్. మీ కోచ్ పేరు నరేందర్. వి□ ప్రధాని నరేంద్ర. నాకు ఇక ఈ పేరు అంటేనే ఇష్టం ఉండదు అని అన్నాడు' అని బాక్సర్ చెప్పాడు. ఆ మాటలకు ప్రధాని మోదీ గట్టిగా నవ్వేశారు.

# జేఎన్‌యూలో ఇరువర్గాల నినాదాలతో ఉద్రిక్తత

## ఉమర్ ఖాలిద్ పుస్తకంపై చర్చ..

- **కార్యక్రమానికి చివరి నిమిషంలో అనుమతి రద్దు.. క్యాంపస్‌లో వేడెక్కిన రాజకీయ వాతావరణం**
- **'Fractured Communities' పుస్తకంపై చర్చ**
- **ఉమర్ ఖాలిద్ విడుదలకు జేఎన్‌యూఎస్‌యూ నినాదాలు**
- **వ్యతిరేకంగా ఏబీవీపీ మద్దతుదారుల నిరసన**
- **ఆడిటోరియం అనుమతిని రద్దు చేసిన వర్సిటీ యాజమాన్యం**
- **చర్చా స్వేచ్ఛను కాపాడతామని విద్యార్థి సంఘం ప్రకటన**

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:**
జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో ఉమర్ ఖాలిద్ రచించిన 'Fractured Communities' పుస్తకంపై నిర్వహించిన చర్చా కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో జేఎన్‌యూఎస్‌యూ నేతలు ఉమర్ ఖాలిద్ విడుదలను కోరుతూ నినాదాలు చేయగా, ఏబీవీపీ మద్దతుదారులు దీనిని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. దీంతో ఎస్ఎస్ఎస్2 భవనం వెలుపల కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**అనుమతి రద్దుతో బయటే చర్చ**
పుస్తకంపై చర్చ నిర్వహించేందుకు విద్యార్థులు ముందుగానే ఆడిటోరియంను బుక్ చేసుకున్నప్పటికీ, వర్సిటీ యాజమాన్యం చివరి నిమిషంలో అనుమతిని రద్దు చేసినట్లు జేఎన్‌యూఎస్‌యూ తెలిపింది. దీంతో కార్యక్రమాన్ని ఎస్ఎస్ఎస్2 భవనం బయట నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారని విద్యార్థి సంఘం పేర్కొంది.

**ఇరువర్గాల మధ్య నినాదాలు**
ఉమర్ ఖాలిద్ విడుదల చేయాలంటూ జేఎన్‌యూఎస్‌యూ నేతలు నినాదాలు చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ ఏబీవీపీ మద్దతుదారులు కూడా నినాదాలు చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాద వాతావరణం ఏర్పడింది. కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఏబీవీపీ మద్దతుదారులు ప్రయత్నించారని జేఎన్‌యూఎస్‌యూ ఆరోపించింది. వక్త నుంచి మైక్రోఫోన్ తీసుకునేందుకు ప్రయత్నించడంతో పాటు ప్యానెలిస్టులతో దురుసుగా వ్యవహరించారని పేర్కొంది. ఈ ఆరోపణలపై ఏబీవీపీ, జేఎన్‌యూ పరిపాలన నుంచి స్పందన వెలువడలేదు.

**చర్చా స్వేచ్ఛపై జేఎన్‌యూఎస్‌యూ ప్రకటన**
ఘటన అనంతరం జేఎన్‌యూఎస్‌యూ ప్రకటన విడుదల చేసింది. విశ్వవిద్యాలయంలో చర్చ, వాదన, భిన్నాభిప్రాయాలకు ఉన్న స్థలాన్ని పరిరక్షించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. ఉమర్ ఖాలిద్‌తో పాటు తాము రాజకీయ ఖైదీలుగా భావిస్తున్న వారికి మద్దతు కొనసాగిస్తామని పేర్కొంది. విద్యా చర్చలను అడ్డుకునే విధంగా ఏబీవీపీ వ్యవహరిస్తోందని ఆరోపించింది. తాజా ఘటనతో జేఎన్‌యూలో మరోసారి రాజకీయ వాతావరణం వేడెక్కింది.

# జేఎస్పీఎస్సీ పరీక్షల అవకతవకలపై ఈడీ దర్యాప్తు

- **విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కదిలిన దర్యాప్తు సంస్థ**
- **14వ ప్రిలిమినరీ పరీక్ష రద్దుకు ప్రభుత్వం అంగీకారం**
- **సీబీఐ విచారణపై మాత్రం వెనక్కి తగ్గిన ప్రభుత్వం**
- **98 శాతం డిమాండ్లు పరిష్కరించామన్న మంత్రి**
- **విధానసభ ముట్టడికి సిద్ధమైన విద్యార్థులు**

**రాంచీ, ఆగస్టు 10:**
జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 14వ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు ప్రారంభించింది. రాష్ట్ర సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ గత వారం ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు చేసింది. జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ అభ్యర్థులు ఆందోళనలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థులతో చర్చించిన అనంతరం 14వ జేపీఎస్సీ పరీక్షతో పాటు కొన్ని నియామక పరీక్షలను రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. అయితే సీబీఐ దర్యాప్తు డిమాండ్‌ను మాత్రం తిరస్కరించింది.

**డిమాండ్లలో 98 శాతం అంగీకరించామన్న ప్రభుత్వం**
విద్యార్థులతో జరిగిన చర్చల అనంతరం మంత్రి సుదివ్య కుమార్ సోను మాట్లాడుతూ.. అభ్యర్థులు లేవనెత్తిన అంశాల్లో దాదాపు 98 శాతం డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. 2023, 2025 సంవత్సరాలకు సంబంధించిన బ్యాక్‌లాగ్ నియామక పరీక్షలతో పాటు 14వ జేపీఎస్సీ పరీక్షను రద్దు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు వెల్లడించారు. అయితే జేఎస్ఎస్సీ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్షను రద్దు చేయడం, అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలన్న డిమాండ్లను అంగీకరించలేదని స్పష్టం చేశారు.

**సీబీఐ విచారణపై విద్యార్థుల పట్టుదల**
ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ ప్రధాన డిమాండ్ అయిన సీబీఐ దర్యాప్తును ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆరోపించారు. ప్రభుత్వం 98 శాతం డిమాండ్లు పరిష్కరించిందన్న ప్రకటన వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉందని విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. తాము 13 పరీక్షలను రద్దు చేయాలని కోరగా కేవలం మూడు పరీక్షలను మాత్రమే రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు.

**సీఐడీ దర్యాప్తుపైనా అనుమానాలు**
నియామక పరీక్షలపై ఇప్పటికే రాష్ట్ర సీఐడీ విచారణ కొనసాగుతున్నప్పటికీ దానిపైనే ఆధారపడటం సరిపోదని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. గతంలో కొన్ని వ్యవహారాల్లో సీఐడీ దర్యాప్తుపై అనుమానాలు వ్యక్తమైనందున స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటే సీబీఐ దర్యాప్తు అవసరమని స్పష్టం చేశారు.

**విధానసభ ముట్టడికి పిలుపు**
ప్రభుత్వ ప్రతిపాదనను తిరస్కరించిన విద్యార్థులు సోమవారం విధానసభ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు.

## నకిలీ ప్రచారానికి అడ్డుకట్ట వేయాలి..

# మెటాకు కేంద్రం ఆదేశం

- **అల్గోరిథమ్‌లో అవసరమైన మార్పులు చేయాలని సూచన..**
- **డీప్‌ఫేక్‌లపై వేగంగా చర్యలు తీసుకోవాలని స్పష్టీకరణ**
- **నకిలీ కంటెంట్ వ్యాప్తిని నియంత్రించాలని ఆదేశం**
- **అల్గోరిథమ్ పనితీరుపై కేంద్రం దృష్టి**
- **డీప్‌ఫేక్‌లు, మార్ఫ్‌డ్ చిత్రాలను గుర్తించే సాంకేతికతపై సూచనలు**
- **కంటెంట్ నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశం**
- **ప్రభుత్వ ఆదేశాలపై వేగంగా స్పందించాలని స్పష్టీకరణ**




**న్యూఢిల్లీ, ఆగస్టు 10:**
సోషల్ మీడియా వేదికలపై నకిలీ ప్రచారం, డీప్‌ఫేక్‌లు, మార్ఫ్‌డ్ చిత్రాలు, వీడియోల వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం మెటాకు కీలక సూచనలు చేసింది. తప్పుడు సమాచారాన్ని ఎక్కువగా చేరవేసే అవకాశం ఉంటే సోషల్ మీడియా అల్గోరిథమ్‌లో అవసరమైన మార్పులు చేయాలని ఆదేశించింది. చట్టవిరుద్ధమైన కంటెంట్‌పై వేగంగా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వంతో సమన్వయాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సూచించింది.

**అల్గోరిథమ్‌పై దృష్టి**
ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో ఏ కంటెంట్ ఎక్కువ మందికి చేరాలి, ఏది పరిమితంగా కనిపించాలనే విషయాన్ని అల్గోరిథమ్ నిర్ణయిస్తుంది. ఈ వ్యవస్థ తప్పుడు లేదా ప్రజలను తప్పుదోవ పట్టించే సమాచారాన్ని విస్తృతంగా వ్యాప్తి చేసేలా ఉండకూడదని కేంద్రం స్పష్టం చేసింది. అవసరమైతే అల్గోరిథమ్ విధానాలను సవరించి నకిలీ ప్రచారాన్ని నియంత్రించాలని మెటాకు సూచించింది.

**డీప్‌ఫేక్‌లపై సాంకేతికత**
డీప్‌ఫేక్‌లు, మార్ఫ్‌డ్ ఫొటోలు, వీడియోలను గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని కేంద్రం సూచించింది. చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను గుర్తించిన వెంటనే తగిన చర్యలు తీసుకునే విధానాన్ని మరింత సమర్థంగా రూపొందించాలని పేర్కొంది. తప్పుడు కంటెంట్ గుర్తింపు, నియంత్రణకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని కోరింది.

**కంటెంట్ నియంత్రణ బలోపేతం**
సోషల్ మీడియా వేదికలపై కంటెంట్ మోడరేషన్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. నకిలీ సమాచారం గుర్తించిన తర్వాత దాని వ్యాప్తిని అడ్డుకునేలా అంతర్గత వ్యవస్థలను మెరుగుపరచాలని సూచించింది. వినియోగదారులకు తప్పుడు సమాచారం చేరకుండా ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని వెల్లడించింది.

**డేటా స్థానికీకరణపై సూచన**
డేటా లోకలైజేషన్‌కు సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కేంద్రం మెటాకు సూచించింది. ప్రభుత్వం ఆదేశించిన సందర్భాల్లో సంబంధిత కంటెంట్‌పై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. కేంద్ర సంస్థలతో సమన్వయం పెంచుకుని చట్టపరమైన అవసరాలకు అనుగుణంగా స్పందించాలని పేర్కొంది. సోషల్ మీడియా వేదికలపై తప్పుడు ప్రచారం, కృత్రిమంగా సృష్టించిన కంటెంట్ ప్రభావాన్ని తగ్గించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశంగా కేంద్రం తెలిపింది.

# కనుమరుగవుతున్న పిచ్చుకల కిచకిచలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

ఒకప్పుడు పల్లె ఉదయానికి పిచ్చుకల కిచకిచలే నిద్రలేపేవి. ఇంటి ముంగిట, పైకప్పులపై, ధాన్యం రాశుల చుట్టూ గుంపులుగా చేరిన పిచ్చుకలు గ్రామీణ జీవనంలో విడదీయరాని భాగంగా కనిపించేవి. కానీ కాలం మారింది. పల్లెల రూపురేఖలు మారాయి. ఇళ్ల నిర్మాణశైలి నుంచి వ్యవసాయ పద్ధతుల వరకు వచ్చిన మార్పులు చిన్న పక్షుల జీవనాన్నీ ప్రభావితం చేశాయి. ఒకప్పుడు నిత్యం కనిపించిన పిచ్చుకలు ఇప్పుడు అరుదుగా దర్శనమిస్తున్నాయి. శంకరపట్నం మండలం కేశవపట్నంలో సోమవారం అంతరించిపోతున్న ఆరపిచ్చుకల గుంపు శెనార్తి మీడియా ప్రతినిధి కెమెరాకు చిక్కడం ఆసక్తిని రేకెత్తించింది. ఒకేచోట గుంపుగా కనిపించిన పిచ్చుకలు గత జ్ఞాపకాలను గుర్తు చేశాయి. ప్రస్తుతం గ్రామాల్లోనూ అక్కడక్కడ మాత్రమే కనిపిస్తున్న ఈ పక్షులు రానున్న రోజుల్లో మరింత అరుదుగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయని పక్షి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేశవపట్నంలో కెమెరాకు చిక్కిన ఆరపిచ్చుకల గుంపు కేవలం ఒక దృశ్యం కాదు.. మన పల్లెల్లో ఒకప్పుడు మారుమోగిన కిచకిచల జ్ఞాపకానికి ప్రతిబింబం. ఆ శబ్దం పూర్తిగా కనుమరుగయ్యేలోపు పిచ్చుకలకు మళ్లీ మన ఇళ్లలో చోటు కల్పించాల్సిన అవసరం ఉందని పక్షి ప్రేమికులు సూచిస్తున్నారు.

# ఘనంగా తిరంగా యాత్ర



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బెజ్జంకి మండల కేంద్రంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. మండల అధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువత మోటార్‌సైకిళ్లపై, రైతులు ట్రాక్టర్లపై జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. 'భారత్ మాతాకీ జై', 'వందే మాతరం' నినాదాలతో మండల కేంద్రం దేశభక్తి వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ జెండా భారతదేశ స్వాతంత్ర్యానికి, దేశ ప్రజల ఐక్యతకు ప్రతీక అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశం పట్ల బాధ్యతతో ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని సూచించారు. యువతలో దేశభక్తి భావనను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబం జాతీయ జెండాను తమ ఇంటిపై ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. జాతీయ పతాకానికి గౌరవం ఇవ్వడంతో పాటు దేశ అభివృద్ధి, ఐక్యత కోసం ప్రజలు భాగస్వాములు కావాలని అన్నారు. తిరంగా యాత్రలో యువత, రైతులు ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా సాగింది. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పల్లెపల్లెలో టీఆర్ఎస్ జెండా



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలం కేశవపట్నంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండాను సోమవారం ఆవిష్కరించారు. తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, మానకొండూరు నియోజకవర్గ ఇంచార్జ్ చైతన్య, శంకరపట్నం మండల ఇంచార్జ్ ఎం.డి. సల్మా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే గ్రామ గ్రామాన తెలంగాణ రక్షణ సేన జెండా ఎగరాలని అన్నారు. కల్వకుంట్ల కవిత స్థాపించిన పార్టీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పల్లె నుంచి పట్నం వరకు టీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు. నియోజకవర్గ ఇంచార్జ్ చైతన్య మాట్లాడుతూ బీసీలు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే టీఆర్ఎస్‌తోనే సాధ్యమని అన్నారు. పార్టీ పాంచజన్యంగా పేర్కొంటున్న ఉచిత విద్య, ఉచిత వైద్యం, యువతకు ఉపాధి, రైతే రాజు, సామాజిక న్యాయం అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. జెండా ఆవిష్కరణ అనంతరం కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లింగంపల్లి నాగరాజు, మజీద్, అంకం శివరాణి, అతార్, జైపాల్‌రెడ్డి, రవి సౌరవ్, పరుశరాములు, శ్రీను, లక్ష్మణ్, రమేష్, శిరీష, అశోక్, అన్నపూర్ణ, , సురేష్, సాయి, ఉమర్, తాజ్ బాబా, రఫీ, మహేష్ పాల్గొన్నారు.





# గుండ్లపల్లి–పొత్తూరు రోడ్డు నిర్మించాలి

- **హామీ ఇచ్చిన ఎమ్మెల్యే వెంటనే పనులు ప్రారంభించాలి**
- **బీజేపీ నాయకుల డిమాండ్**

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మండల కేంద్రం మీదుగా పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గుండ్లపల్లిలో ర్యాలీ నిర్వహించి రాజీవ్ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గుండ్లపల్లి రాజీవ్ రహదారి నుంచి పొత్తూరు వరకు ఉన్న రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గన్నేరువరం మండల కేంద్రం మీదుగా డబుల్ రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చినా ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ఎమ్మెల్యే స్పందించకపోతే మండల ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మానకొండూరు నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి, సొల్లు అజయ్ వర్మ, ఏలేటి చంద్రారెడ్డి, విలాసాగర్ రామచంద్రం, పుల్లెల రాము, పుల్లెల జగన్, మచ్చ సాయికృష్ణతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ తన నివాసంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, ఆగస్టు 15ను పురస్కరించుకుని మండల ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.



# రోడ్లపై పశువులు వదిలితే చర్యలు

- **10 పశువులు గోశాలకు తరలింపు**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రజా రహదారులపై పశువులను విచ్చలవిడిగా వదిలే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు హెచ్చరించారు. రోడ్లపై పశువుల సంచారంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇప్పటికే పశువుల యజమానులకు ఏడు రోజుల గడువుతో నోటీసులు జారీ చేసినప్పటికీ పలు ప్రాంతాల్లో పశువులు రహదారులపై సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఆగస్టు 9న మున్సిపల్ అధికారులు ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారులపై సంచరిస్తున్న 10 పశువులను పట్టుకుని గోశాలలకు తరలించారు. పశువులను యజమానులు తమ సొంత ప్రదేశాల్లోనే సురక్షితంగా ఉంచాలని, రోడ్లు, వీధులు, బహిరంగ ప్రదేశాల్లోకి వదలవద్దని అధికారులు సూచించారు. ఇకపై ముందస్తు సమాచారం లేకుండానే రోడ్లపై సంచరించే పశువులను పట్టుకుని గోశాలలకు తరలించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పశువుల పట్టివేత కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ప్రజల భద్రత, సురక్షిత ట్రాఫిక్ నిర్వహణకు సహకరించాలని కోరారు.





## బాధిత కుటుంబానికి రసమయి పరామర్శ

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ముక్కిస లచ్చవ్వ ఇటీవల మృతి చెందగా మానకొండూరు మాజీ ఎమ్మెల్యే డా. రసమయి బాలకిషన్ ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బెజ్జంకి మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, లింగాల లక్ష్మణ్, చింతకింది శ్రీనివాస్ గుప్తా, ముక్కిస తిరుపతి రెడ్డి, ముక్కిస రాజిరెడ్డి, ఎల శేఖర్ బాబు, ముక్కిస అంజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాల్ రెడ్డి, జగన్ రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల ధరలు తగ్గించాలి



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

ఎరువుల ధరలను వెంటనే తగ్గించి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బెజ్జంకి మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఎరువుల ధరల పెంపునకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను విపరీతంగా పెంచి రైతులపై భారాన్ని మోపుతోందని విమర్శించారు. ఎరువుల ధరలు పెంచుతున్న ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు మాత్రం గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కారణంగా 32 దేశాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకునే అవకాశం కల్పించారని, సుంకం లేకుండా దిగుమతులకు అవకాశం ఇవ్వడంతో దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. దేశంలో ఏటా రూ.18 లక్షల కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్‌కు వస్తున్నప్పటికీ కనీస మద్దతు ధరలు అమలు కాకపోవడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, ప్రస్తుతం ఉత్పత్తి వ్యయాన్ని తక్కువగా లెక్కించి మద్దతు ధర నిర్ణయిస్తోందని విమర్శించారు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని రైతులు ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. వెంటనే రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి న్యాయం చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు బొమ్మిడి సాయికృష్ణ, సంగ ఎల్లయ్య, బోనగిరి లింగం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడికి సన్మానం



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

బెజ్జంకి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కత్తి రమేష్ నియమితులైన సందర్భంగా పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నాయకులు ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో రమేష్ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మి నరసింహ రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు మచ్చ రాజేశం, రంగోని రాజు, అమరగొండ రాజు, తిప్పారపు మల్లేశం, గంగాధర రామచంద్రం, కర్రవుల శంకర్, బొడ్డు శ్రీను తదితరులు కత్తి రమేష్‌ను అభినందించారు.

## అత్యవసర సిబ్బందికి ఫ్యాన్, కుర్చీలు అందజేత

**శెనార్తి మీడియా, బోథ్:**

బోథ్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో అత్యవసర సేవల సిబ్బంది విధులు నిర్వహించే గదిలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన బోథ్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు వెంటనే స్పందించారు. వీడీసీ అధ్యక్షుడు అల్లకొండ పోతన్న సిబ్బంది కోసం ఒక ఫ్యాన్, రెండు కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది గ్రామాభివృద్ధి కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 108 సిబ్బంది సేరె సంతోష్, రవి, రమేష్, బీబీ సింగ్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు

# పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ

- పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ
- ఆగస్టు 20 నుంచి రెండు నెలలు..
- పుస్తకాలు, అల్పాహారం, భోజనం ఉచితం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే మంచిర్యాల నియోజకవర్గ యువతకు ఆగస్టు 20 నుంచి రెండు నెలల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే నివాసంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం 7,437 పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, జిల్లాకు చెందిన అభ్యర్థులు ఈ నెల 16లోగా దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. మంచిర్యాల పట్టణంలోని వెంకటేశ్వర్లు థియేటర్ చౌరస్తా వద్ద ఉన్న టీటీడీ మండపంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వర్గీయ కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే శిక్షణలో పుస్తకాలు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామని చెప్పారు.



**- ప్రభుత్వ విద్యార్థులకు టిఫిన్, భోజనం**

మంచిర్యాల కాలేజీ రోడ్డులోని పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ (ఇస్కాన్) ఆధ్వర్యంలో సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. తొలుత ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల విద్యార్థులకు టిఫిన్ అందించి, దసరా నాటికి మధ్యాహ్న భోజనం కూడా ప్రారంభిస్తామని చెప్పారు. దసరా తర్వాత ఈ కార్యక్రమాన్ని చెన్నూరులో అమలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు ఈ పథకం వర్తించదని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్‌లో విభేదాలు లేవు**

కాంగ్రెస్ కార్పొరేటర్లు పార్టీని వీడుతారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో విభేదాలు ఉన్నట్లు అపోహలు సృష్టించేందుకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు.

**రేపటి నుంచి తాగునీటి సరఫరా**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు మంగళవారం నుంచి తాగునీటి సరఫరా ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే వెల్లడించారు. సమావేశంలో మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్యమహేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు



# అభివృద్ధిపై చర్చకు బీజేపీ సిద్ధమా..?

- - భక్తి ముసుగులో రాజకీయాలు..
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

అయోధ్య రామమందిరం పేరుతో బీజేపీ నాయకులు రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ రావు విమర్శించారు. రామమందిర నిర్మాణంలో అవినీతి, అక్రమాలపై ఆరోపణలు వచ్చిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు. సోమవారం పట్టణంలోని ఐబీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో గత 25 ఏళ్లుగా జరిగిన అభివృద్ధి బీజేపీ నాయకులకు కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై మాట్లాడకుండా భక్తి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. వాట్సాప్‌లో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో రోడ్లు, మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. జిల్లా ఏర్పాటు, మెడికల్ కాలేజీ వంటి కీలక అభివృద్ధి కార్యక్రమాలు బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే జరిగాయని గుర్తు చేశారు. గత పాలనలో జరిగిన అభివృద్ధిని విస్మరించి విమర్శలు చేయడం తగదన్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చే వారు నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 30 ఏళ్ల క్రితం పరిస్థితులను ప్రస్తుత పరిస్థితులతో పోల్చుతూ మాట్లాడటం సరికాదని విజిత్ రావు అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎమ్మెస్ చైర్మన్లు తిప్పని లింగన్న, కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, మాజీ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ తిరుపతి, నాయకులు పురుషోత్తం, చాంద్, ప్రభాకర్, బాపు పాల్గొన్నారు.

# మంజునాథ మిల్లులో అధికారుల దాడి




- 30 టన్నుల దొడ్డు బియ్యంతో లారీ పట్టివేత

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని మంజునాథ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో ఇతర జిల్లా నుంచి తీసుకొచ్చిన బియ్యాన్ని అన్‌లోడ్ చేస్తుండగా సివిల్ సప్లైస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం సాయంత్రం ఆకస్మికంగా దాడి చేశారు. ఈ సందర్భంగా సుమారు 30 టన్నుల బియ్యంతో ఉన్న లారీని అధికారులు పట్టుకున్నారు. మిల్లులో బియ్యం అన్‌లోడ్ చేసేందుకు సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా అనే అంశంపై అధికారులు ఆరా తీశారు. పట్టుబడిన బియ్యం రేషన్ బియ్యమా? లేక ఇతర రకానికి చెందినదా? అనే విషయాన్ని నిర్ధారించేందుకు నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. మంజునాథ ఆగ్రో ఇండస్ట్రీస్ మిల్లులో గతంలోనూ ధాన్యం నిల్వలు, మిల్లింగ్‌కు సంబంధించిన అంశాలపై ఆరోపణలు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మిల్లులోని ధాన్యం నిల్వలు, కొనుగోలు, విక్రయాలు, తరలింపులకు సంబంధించిన రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. సీజన్ వారీగా మిల్లులకు కేటాయించిన ధాన్యం, మిల్లింగ్ అనంతరం ఉన్న నిల్వలను అధికారులు లెక్కిస్తే అక్రమాలకు సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ దాడిలో సివిల్ సప్లైస్ డీటీ స్రవంతి, టీఏ శంషుద్దీన్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై డి.కొండ రమేష్, జైపూర్ ఆర్ఐ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

# హైటెక్ సిటీ రోడ్లపై బీజేపీ మహిళా మోర్చా నిరసన

- వరి నాట్లు వేసి వినూత్న ఆందోళన..
- రోడ్ల నిర్మాణానికి డిమాండ్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల పట్టణంలోని హైటెక్ సిటీ రోడ్ల దుస్థితిని నిరసిస్తూ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం వినూత్న ఆందోళన నిర్వహించారు. గుంతలమయంగా మారిన రోడ్లపై వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా అధ్యక్షురాలు పచ్చ స్వప్న రాణి మాట్లాడుతూ హైటెక్ సిటీ రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణం కోసం అప్పటి డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ నాట్లు వేసి నిరసన తెలిపారని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా హైటెక్ సిటీలో రోడ్ల నిర్మాణం చేపట్టలేదని విమర్శించారు.



చిన్నపాటి వర్షానికే రోడ్లపై వాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి హైటెక్ సిటీలో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొండవీటి తిరుమల, భైరం లక్ష్మీ, తూటి సరస్వతి, జిట్టవేణి రేణుక, దాసరి పద్మ, సృజన, సుకన్య, వీణ తదితరులు పాల్గొన్నారు.

## బోనమెత్తిన గాంధీనగర్

**సిటీబ్యూరో,హైదరాబాద్:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢమాస బోనాల ఉత్సవాలు హైదరాబాద్ లో ఎంతో భక్తిశ్రద్ధలతో,అంగరంగ వైభవంగా జరిగాయి.సంప్రదాయ దుస్తుల్లో చిన్న, పెద్ద తేడాలేకుండా అమ్మవారికి బోనాల మొక్కులను ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించి ఆలయాలను దర్శించుకున్నారు. కుత్బుల్లాపూర్ లోని శ్రీపోచమ్మ,మంకాలమ్మ ఆలయాలన్ని ఎంతో ఆధ్యాత్మికశోభతో,పూల అలంకరణలతో కనులపండుగగా కనువిందు చేశాయి.. అనంతరం డప్పు వాయిద్యాలనడుమ తొట్టెలు, ఘటాల ఊరేగింపులో గొర్రె పొట్టేళ్లతో ఫలహారపు బండ్లను ఊరేగించారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు

# మొక్కల సంరక్షణ బాధ్యత విద్యార్థులదే

- - ప్రకృతి మిత్ర ఆధ్వర్యంలో వనమహోత్సవం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ప్రకృతి మిత్ర వ్యవస్థాపకులు గుండేటి యోగేశ్వర్ సూచించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవంలో భాగంగా సోమవారం సాయికుంటలోని ఇంటిగ్రేటెడ్ బీసీ బాలుర హాస్టల్ ఆవరణలో ప్రకృతి మిత్ర ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటించి, వాటి సంరక్షణ బాధ్యతలను వారికి అప్పగించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోయడం, సంరక్షించడం ద్వారా వాటి ఎదుగుదలకు సహకరించాలని సూచించారు. మొక్కల ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



మొక్కలను సమర్థంగా సంరక్షించే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ సుధమల హరికృష్ణ, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి ముకుందం, జిల్లా ఫారెస్ట్ ఏవో పొన్న మల్లయ్య, బీసీ హాస్టల్ వెల్ఫేర్ అధికారి గుండు వెంకటేష్, ఎంపీడీవో శ్రీపతి బాబు, ఎంపీవో పోలంపల్లి వెంకటేష్, హాస్టల్ అధికారులు నైతం లక్ష్మణ్, ప్రకృతి మిత్ర సభ్యులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి



- పీఎస్ హెచ్ఎంలకు రెండో ఎంఈఓ బాధ్యతలు కల్పించాలి..
- – ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల జిల్లా అధ్యక్షుడు రావుల శంకర్

**శెనార్తి మీడియా, బోథ్:**

ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు రెండో ఎంఈఓలుగా బాధ్యతలు అప్పగించాలని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల జిల్లా అధ్యక్షుడు రావుల శంకర్ కోరారు. పీఎస్ హెచ్ఎంల స్థానంలో ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను నియమించి, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 24 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన సెకండరీ గ్రేడ్ టీచర్లకు పీఎస్ హెచ్ఎంలుగా పదోన్నతులు కల్పించి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని సూచించారు. 100 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విభాగాలను ఏర్పాటు చేసి, కంప్యూటర్ విద్యను అందించాలని కోరారు. 'మన ఊరు-మన బడి'లో ఎంపికైన పాఠశాలలకు మంజూరైన డబుల్ డెస్క్ బెంచీలను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. సర్వశిక్ష అభియాన్‌లో పీఎస్ హెచ్ఎంలకు ఎస్ఓలుగా అవకాశం కల్పించాలని కోరారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నెల మోహన్, పీఎస్ హెచ్ఎంలు అమరేందర్, ఈశ్వర్, గంగారాం, రజిత తదితరులు ఉన్నారు.

# గుప్త నిధుల పేరుతో కోటి రూపాయల మోసం

- బొగ్గును బంగారంగా మారుస్తామంటూ బురిడీ.. నలుగురు నిందితుల అరెస్టు
- 11 మంది బాధితుల నుంచి రూ.కోటి వసూలు
- నకిలీ బంగారు నాణేలతో మోసాలకు పాల్పడిన ముఠా
- ఇళ్ల కింద నిధులున్నాయంటూ బాధితులకు వల
- నాలుగు మొబైళ్లు, వాహనాలు, నకిలీ నాణేలు స్వాధీనం
- రాజేంద్రనగర్ పోలీసుల దర్యాప్తు

**హైదరాబాద్, ఆగస్టు 10:**

గుప్త నిధుల పేరుతో అమాయకులను నమ్మించి భారీగా డబ్బు వసూలు చేస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఇళ్ల కింద నిధులు ఉన్నాయని, ప్రత్యేక శక్తులతో వాటిని వెలికితీస్తామని నమ్మబలికిన నలుగురు నిందితులు 11 మంది నుంచి దాదాపు రూ.కోటి దండుకున్నట్లు పోలీసులు గుర్తించారు. శంషాబాద్ జోన్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్, రాజేంద్రనగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో నిందితులను సోమవారం అరెస్టు చేశారు.




- **బొగ్గును బంగారంగా నమ్మించి**

గుడిమల్కాపూర్‌కు చెందిన మొహమ్మద్ మునావర్ (36), జవహర్‌నగర్‌కు చెందిన సయ్యద్ అలీ అష్రాఫ్ (40), మొహమ్మద్ హాజీ (25), కీసరకు చెందిన మొహమ్మద్ సల్మాన్ (29) కలిసి ఈ మోసాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ అవసరాలకు సరిపడా ఆదాయం లేకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మునావర్ ఈ పథకాన్ని రూపొందించినట్లు విచారణలో వెల్లడైంది.

- **ఇళ్లలో తవ్వకాలు**

బాధితుల ఇళ్ల కింద గుప్త నిధులు ఉన్నాయని ముఠా సభ్యులు ప్రచారం చేసేవారు. తమకు నిధులను గుర్తించి బయటకు తీసే శక్తులు ఉన్నాయని చెప్పి బాధితులను నమ్మించేవారు. వారి ఇళ్లలో తవ్వకాలు జరిపిన అనంతరం ముందుగానే సిద్ధం చేసుకున్న నకిలీ బంగారు నాణేలు, బొగ్గుతో కూడిన సంచులను అక్కడ ఉంచేవారు.

- **బొగ్గు బంగారమవుతుందని నమ్మబలికి**

తాము ఉంచిన బొగ్గు కొద్ది రోజుల్లో బంగారంగా మారుతుందని చెప్పి బాధితుల నుంచి భారీ మొత్తంలో నగదు తీసుకునేవారు. డబ్బు తీసుకున్న తర్వాత అక్కడి నుంచి మాయమయ్యేవారు. ఈ విధానంలో ఇప్పటివరకు 11 మందిని మోసం చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

- **వాహనాలు, నకిలీ నాణేలు స్వాధీనం**

నిందితుల నుంచి రెండు కార్లు, ఒక ఆటోరిక్షా, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే 25 నకిలీ బంగారు నాణేలు, ఆరు కిలోల బొగ్గు, పూజా సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ముఠా మోసాల వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేపట్టారు.

# 600వ టెస్టుకు సిద్ధమైన టీమిండియా

**స్వాతంత్ర్య దినోత్సవం రోజే చారిత్రక మ్యాచ్**
**శ్రీలంకతో గాలేలో తొలి టెస్టు**

**స్పోర్ట్స్ డెస్క్ :**
భారత క్రికెట్ చరిత్రలో మరో అరుదైన ఘట్టానికి రంగం సిద్ధమైంది. 2026 ఆగస్టు 15న దేశం స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనున్న వేళ.. టీమిండియా తన 600వ టెస్టు మ్యాచ్‌లో బరిలోకి దిగనుంది. శ్రీలంకతో గాలే అంతర్జాతీయ మైదానంలో ప్రారంభమయ్యే ఈ మ్యాచ్‌తో భారత్ సుదీర్ఘ టెస్టు ప్రయాణంలో కీలక మైలురాయిని చేరుకోనుంది. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో భారత జట్టు ఈ చారిత్రక మ్యాచ్‌ను ఆడనుంది. టెస్టు క్రికెట్‌లో 600 టెస్టులు ఆడిన జట్లలో ఇప్పటివరకు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు భారత్ కూడా ఈ ప్రత్యేక జాబితాలో చేరనుంది. అంతేకాకుండా 600 టెస్టుల మైలురాయిని అందుకున్న తొలి ఆసియా జట్టుగా భారత్ రికార్డు సృష్టించనుంది.

**1932లో మొదలైన ప్రస్థానం**
భారత్ టెస్టు ప్రయాణం 1932 జూన్ 25న ఇంగ్లండ్‌తో లార్డ్స్ మైదానంలో ప్రారంభమైంది. సీకే నాయుడు నాయకత్వంలో మొదలైన ఈ ప్రయాణం 94 ఏళ్ల తర్వాత 600వ మ్యాచ్‌కు చేరుకుంది. ఈ సుదీర్ఘ కాలంలో భారత క్రికెట్ ఎన్నో గొప్ప విజయాలు, మరపురాని క్షణాలు, దిగ్గజ ఆటగాళ్లను చూసింది.
భారత్ 100వ టెస్టును 1967లో ఆస్ట్రేలియాతో ఆడగా.. మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ నాయకత్వం వహించాడు. 1982లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్ భారత 200వ టెస్టుగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో సునీల్ గవాస్కర్ జట్టుకు నాయకత్వం వహించాడు. 2016లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్ భారత 500వ టెస్టుగా చరిత్రలో నిలిచింది. ఆ సమయంలో విరాట్ కోహ్లీ కెప్టెన్‌గా ఉన్నాడు.



**గిల్ నాయకత్వంలో కొత్త అధ్యాయం**
600వ టెస్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. సీకే నాయుడు నుంచి పటౌడీ, గవాస్కర్, కపిల్ దేవ్, అజారుద్దీన్, సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రవిడ్, మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వరకు సాగిన భారత టెస్టు ప్రస్థానం ఇప్పుడు గిల్ తరం వరకు చేరింది.
ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజునే ఈ చారిత్రక మ్యాచ్ జరగడం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. శ్రీలంక పర్యటనలో భారత్ రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. తొలి టెస్టు ఆగస్టు 15న గాలేలో ప్రారంభం కానుండగా.. రెండో టెస్టు ఆగస్టు 23న కొలంబోలో మొదలవుతుంది.

## పిలుపొస్తే టీమిండియాలోకి వస్తా

**ప్రపంచకప్ కోసం సిద్ధంగా ఉన్న భువనేశ్వర్**
**ఐపీఎల్‌లో 28 వికెట్లతో అదరగొట్టిన పేసర్**

**స్పోర్ట్స్ డెస్క్ :**
భారత వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్ అంతర్జాతీయ క్రికెట్‌లో పునరాగమనంపై మరోసారి స్పష్టత ఇచ్చాడు. 2027 వన్డే ప్రపంచకప్ కోసం జాతీయ జట్టు సెలక్టర్ల నుంచి పిలుపు వస్తే భారత్ తరపున ఆడేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపాడు. ప్రస్తుతం 36 ఏళ్ల భువనేశ్వర్ అద్భుతమైన ఫామ్‌లో ఉండటంతో అతడిని తిరిగి జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి టైటిల్ గెలవడంలో భువనేశ్వర్ కీలక పాత్ర పోషించాడు. 16 మ్యాచ్‌ల్లో 28 వికెట్లు తీసి సత్తా చాటాడు. దీంతో రవిచంద్రన్ అశ్విన్, రవిశాస్త్రి, దినేశ్ కార్తీక్ వంటి మాజీ క్రికెటర్లు సైతం అతడిని జాతీయ జట్టులోకి తీసుకోవాలని సూచించారు. భారత్ తరపున ఆడే అవకాశం వస్తే తప్పకుండా సిద్ధంగా ఉంటానని భువనేశ్వర్ చెప్పాడు. అయితే తన చేతుల్లో లేని విషయాల గురించి



ఎక్కువగా ఆలోచించనని స్పష్టం చేశాడు. జట్టులోకి తీసుకోవాలా వద్దా అనేది సెలక్టర్ల నిర్ణయమని పేర్కొన్నాడు. తన శరీరం సహకరించినంతకాలం క్రికెట్ ఆడుతూనే ఉంటానని తెలిపాడు. అందుకే ప్రస్తుతం యూపీ టీ20 లీగ్‌లో ఆడుతున్నానని చెప్పాడు. ఎవరినో ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో తాను క్రికెట్ ఆడటం లేదని, జట్టు కోసం రాణించి విజయాలు అందించడమే తన లక్ష్యమని స్పష్టం చేశాడు. భువనేశ్వర్ చివరిసారిగా 2022లో భారత్ తరపున అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు.

## కేఎల్ రాహుల్ కెప్టెన్ కాకపోవడం మంచిదే..

భారత మాజీ క్రికెటర్, పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ కోచ్ వసీం జాఫర్ టీమిండియా బ్యాటర్ కేఎల్ రాహుల్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌కు రాహుల్ సారథిగా, జాఫర్ బ్యాటింగ్ కోచ్‌గా పనిచేసిన సమయంలో ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఏర్పడింది. ఇటీవల ఒక క్రికెట్ టాక్ షోలో మాట్లాడిన జాఫర్, కేఎల్ రాహుల్ నాయకత్వ బాధ్యతలు తీసుకోకపోవడమే అతని వ్యక్తిత్వానికి, ఆటతీరుకు ఎంతో మంచిదని అభిప్రాయపడ్డారు. కప్టెన్సీ భారం లేకపోతే రాహుల్ తన సహజసిద్ధమైన గేమ్‌ను స్వేచ్ఛగా ఆడుతాడని, ఏటా ఐపీఎల్‌లో 500 నుంచి 600 రన్స్ చేసే సత్తా అతనికి ఉందనేది జాఫర్ అభిప్రాయం. రాహుల్ అత్యంత నమ్మకమైన ఆటగాడని, తన ఒంటిచేతి ప్రదర్శనతో సీజన్‌లో 23 మ్యాచ్‌లను గెలిపించగలడని ప్రశంసించారు. అయితే, అతని మనస్తత్వానికి కప్టెన్సీ అనేది ఒక అదనపు ఒత్తిడిని పెంచుతుందని, దానివల్ల అతని పూర్తి సామర్థ్యంతో ఆడలేకపోతున్నారని స్పష్టం చేశారు. పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్‌జెయింట్స్ టీమ్ లను నడిపించిన రాహుల్, ఆ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్‌కు మారినప్పుడు కూడా కప్టెన్సీకి దూరంగా ఉండటమే శ్రేయస్కరమని భావించారు. ప్రస్తుతం భారత్‌శ్రీలంక మధ్య గాల్, కొలంబో వేదికలుగా జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌లో కేఎల్ రాహుల్ పాత్ర అత్యంత కీలకం కానుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగమైన ఈ సిరీస్‌లో అనుభవజ్ఞుడైన సీనియర్ బ్యాటర్‌గా జట్టు సమతుల్యతను నిలబెట్టే బాధ్యత అతనిపై ఉంది. ప్రాక్టీస్ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో ఓపెనర్‌గా వచ్చి 40 పరుగులు చేసి మంచి లయ కనబరిచిన రాహుల్, కప్టెన్సీ ఒత్తిడి లేకుండా ఈ టెస్టు సిరీస్‌లో చెలరేగిపోతాడని అభిమానులు ఆశిస్తున్నారు.

## ఒకే మ్యాచ్‌లో అరంగేట్రం.. ఇప్పుడు ఒకే స్థానం కోసం పోటీ!

**జురెల్ వర్సెస్ సర్ఫరాజ్.. ఎవరికి చోటు?**
**వార్మప్ మ్యాచ్‌తో మారిన సమీకరణాలు**

**స్పోర్ట్స్ డెస్క్ :**
భారత టెస్టు జట్టులో ఆసక్తికర పోటీ నెలకొంది. ఒకే మ్యాచ్‌లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ ఇప్పుడు తుది జట్టులో ఒకే స్థానం కోసం పోటీ పడుతున్నారు. 2024 ఫిబ్రవరి 15న రాజ్‌కోట్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో ఇద్దరూ ఒకేసారి భారత టెస్టు టోపీ అందుకున్నారు. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించిన సర్ఫరాజ్‌కు బ్యాటర్‌గా అవకాశం దక్కగా.. రిషభ్ పంత్‌కు ప్రత్యామ్నాయ వికెట్ కీపర్‌గా జురెల్ జట్టులోకి వచ్చాడు.
అరంగేట్రం తర్వాత ఇద్దరి ప్రయాణం భిన్నంగా సాగింది. ఇప్పటివరకు సర్ఫరాజ్ ఆరు టెస్టులు మాత్రమే ఆడగా.. జురెల్ పది టెస్టుల్లో బరిలోకి దిగాడు. జట్టు అవసరాలకు అనుగుణంగా రాణించడంతో జురెల్ మేనేజ్‌మెంట్ నమ్మకాన్ని సంపాదించాడు. అయితే శ్రీలంక పర్యటనకు ముందు పరిస్థితులు మారిపోయాయి. తొలుత జట్టులో చోటు దక్కించుకున్న సాయి సుదర్శన్ గాయపడటంతో సర్ఫరాజ్ ఖాన్‌కు అనూహ్యంగా పిలుపు వచ్చింది.



ఇదే సమయంలో వార్మప్ మ్యాచ్‌లో జురెల్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. మరోవైపు వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన దేవదత్ పడిక్కల్ అద్భుత శతకంతో తుది జట్టులో తన స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకున్నాడు. దీంతో సర్ఫరాజ్ రాకతో జురెల్ స్థానం ప్రశ్నార్థకంగా మారింది. రిషభ్ పంత్ ప్రధాన వికెట్ కీపర్‌గా జట్టులో ఉన్న నేపథ్యంలో.. జురెల్‌ను వికెట్ కీపర్‌బ్యాటర్‌గా కొనసాగిస్తారా? లేక ప్రత్యేక బ్యాటర్‌గా సర్ఫరాజ్‌కు అవకాశం ఇస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

**శ్రీలంకతో తొలి టెస్టుకు భారత్ అంచనా జట్టు**
కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్/సర్ఫరాజ్ ఖాన్, రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్.

## ఐపీఎల్ తోనే వారి రహస్యాలు తెలుసుకున్నాను

**స్పోర్ట్స్ డెస్క్ :**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ అంతర్జాతీయ క్రికెటర్ల నైపుణ్యాలను తీర్చిదిద్దడంలో, ఇతర దేశాల ఆటగాళ్లతో సత్సంబంధాలు ఏర్పరచడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ ఆల్‌రౌండర్ మోయిసెస్ హెన్రిక్స్ తన క్రికెట్ ప్రయాణంలో ఐపీఎల్ అందించిన ప్రోత్సాహం గురించి, ముఖ్యంగా భారతీయ క్రీడాకారుల వ్యూహాలను అర్థం చేసుకోవడంపై ఆసక్తికర విశేషాలను పంచుకున్నారు. లీగ్‌లో వివిధ ఫ్రాంచైజీల తరపున ఆడటం వల్ల తన కెరీర్ కొత్త మలుపు తిరిగిందని హెన్రిక్స్ పేర్కొన్నారు.
సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీ, వీరేంద్ర సెహ్వాగ్, ఆర్. అశ్విన్, రవీంద్ర జడేజా వంటి దిగ్గజ క్రికెటర్లతో మైదానంలోనూ, వెలుపల సన్నిహితంగా మెలిగే అవకాశం లభించిందని తెలిపారు. టీమిండియా ఆటగాళ్ల మానసిక దృక్పథం, వారి శైలి, మ్యాచ్‌లోని సూక్ష్మ వ్యూహాలు, సీక్రెట్లను ఐపీఎల్ వల్లే తాను దగ్గరుండి గమనించగలిగానని వెల్లడించారు. ఇది అంతర్జాతీయ స్థాయిలో తనకు బాగా ఉపయోగపడిందన్నారు. ఆస్ట్రేలియా జట్టులో స్థానం కోసం పోరాడుతున్న సమయంలో బోర్డు నుంచి తగినంత మద్దతు లేక తీవ్ర మానసిక వేదనను అనుభవించినట్లు హెన్రిక్స్ ఆవేదన వ్యక్తం చేశారు.
ఆ తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్వాహకురాలు కావ్య మారన్ తనకు ఎంతో ఆసరాగా నిలిచారని, ఆమె అందించిన ప్రోత్సాహాన్ని జీవితాంతం మరువలేనని కృతజ్ఞతలు తెలిపారు. 2014 నుండి 2017 మధ్య సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడిన ఆయన, 2016లో జట్టు ఛాంపియన్‌గా నిలవడంలో బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ అద్భుత ప్రదర్శన చేశారు. కాగా, ఆస్ట్రేలియన్ డొమెస్టిక్ క్రికెట్ నుంచి తప్పుకున్న హెన్రిక్స్, ప్రస్తుతం పోర్చుగల్ జాతీయ క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుండటం గమనార్హం.

## పరిచయం లేని క్రీడలో భారత్‌కు పతకం



**సెపక్ టక్రాలో మూడో స్థానం**
**కింగ్స్ కప్‌లో సత్తా చాటిన భారత పురుషుల జట్టు**
**ఆసియా క్రీడలకు ముందు పెరిగిన పతక ఆశలు**

**స్పోర్ట్స్ డెస్క్ :**
భారత్‌లో అంతగా ప్రాచుర్యం లేని సెపక్ టక్రాలో భారత జట్టు సత్తా చాటింది. థాయ్‌లాండ్ వేదికగా జరిగిన కింగ్స్ కప్ సెపక్ టక్రా ఛాంపియన్‌షిప్‌లో పురుషుల క్వాడ్రాంట్ విభాగంలో భారత్ కాంస్య పతకం సాధించింది. నలుగురు ఆటగాళ్లతో కూడిన ఈ విభాగంలో భారత జట్టు ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. ఈ విజయంతో సెప్టెంబర్‌లో జరగనున్న ఆసియా క్రీడల్లో సెపక్ టక్రాలో భారత్ పతకం సాధించగలదన్న ఆశలు పెరిగాయి. సెమీఫైనల్లో భారత్ ఆతిథ్య థాయ్‌లాండ్‌తో తలపడింది. హోరాహోరీగా సాగిన పోరులో భారత జట్టు 159, 915, 915తో ఓటమి పాలైంది. తొలి సెట్‌ను గెలుచుకున్న భారత్.. తర్వాతి రెండు సెట్‌లలో ప్రత్యర్థి ఆధిపత్యాన్ని అడ్డుకోలేకపోయింది. అయితే మొత్తం పోటీలో భారత ఆటగాళ్లు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడం విశేషం. ఆసియా క్రీడల్లో సెపక్ టక్రా కూడా ఉండటంతో ఈ కాంస్య పతకం భారత జట్టుకు ఆత్మవిశ్వాసాన్ని పెంచనుంది.

**బంతిని కాలితో ఆడే ఆట**
సెపక్ టక్రా ఆగ్నేయాసియా దేశాల్లో ప్రాచుర్యం పొందిన క్రీడ. బ్యాడ్మింటన్ కోర్టును పోలిన మైదానంలో ఈ ఆటను నిర్వహిస్తారు. సాధారణంగా రెండు నుంచి నలుగురు ఆటగాళ్లతో జట్లు బరిలోకి దిగుతాయి. బెత్తం లేదా ప్లాస్టిక్‌తో తయారు చేసిన ప్రత్యేక బంతిని ఉపయోగిస్తారు. బంతిని నియంత్రించేందుకు చేతులను ఉపయోగించకూడదు. పాదాలు, మోకాళ్లు, భుజాలు, ఛాతీ, తలను మాత్రమే ఉపయోగించి బంతిని ప్రత్యర్థి వైపు పంపాలి.

**పలు దేశాల్లో భిన్న పేర్లు**
సెపక్ టక్రా ఆట వాలీబాల్, ఫుట్‌బాల్ అంశాలను పోలి ఉంటుంది. మలేషియాలో దీనిని సెపక్ టక్రాగా పిలుస్తారు. ఇండోనేషియాలో సెపక్ రాగా, థాయ్‌లాండ్‌లో టక్రా, మయన్మార్‌లో చిన్లోన్, ఫిలిప్పీన్స్‌లో సిపా, లావోస్‌లో లతావ్, కంబోడియాలో సెక్ డై, వియత్నాంలో కౌ మే అనే పేర్లతో పిలుస్తారు. పేర్లు వేరైనా ఆట విధానం దాదాపు ఒకే విధంగా ఉంటుంది.
1965లో కౌలలంపూర్‌లో జరిగిన ఆగ్నేయాసియా ద్వీపకల్ప క్రీడల్లో సెపక్ టక్రాను పతక విభాగంగా ప్రవేశపెట్టారు. ఆ తర్వాత ఈ క్రీడ ఆగ్నేయాసియా దేశాల్లో విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. తాజాగా కింగ్స్ కప్‌లో భారత్ కాంస్య పతకం సాధించడంతో ఈ క్రీడలో దేశం కూడా తన ఉనికిని చాటుకుంది. రానున్న ఆసియా క్రీడల్లో భారత జట్టు మరింత మెరుగైన ప్రదర్శనతో పతకం సాధించాలని క్రీడాభిమానులు ఆశిస్తున్నారు

## పట్టుదలతో మళ్లీ టీమిండియాలోకి

**17 కిలోలు తగ్గి ఫిట్‌నెస్‌పై దృష్టి**
**స్పిన్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యేక సాధన**

**స్పోర్ట్స్ డెస్క్ :**
టీమిండియాలో చోటు దక్కించుకోవాలంటే ప్రతిభ ఒక్కటే సరిపోదు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకుని సెలెక్టర్ల నమ్మకాన్ని గెలుచుకోవాలి. సర్ఫరాజ్ ఖాన్ గత ఏడాదిన్నరగా ఇదే లక్ష్యంతో కఠోర సాధన చేశాడు. ఏకంగా 17 కిలోల బరువు తగ్గి, తన ఆటలోని లోపాలను సరిదిద్దుకునేందుకు ప్రత్యేకంగా శ్రమించాడు. ఫలితంగా రెండేళ్ల విరామం తర్వాత మళ్లీ భారత టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నాడు. సాయి సుదర్శన్ గాయపడటంతో సర్ఫరాజ్‌కు అనూహ్యంగా మరో అవకాశం వచ్చింది. ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు అతడిని ఎంపిక చేశారు. 2024లో న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో వరుసగా నాలుగు ఇన్నింగ్స్‌ల్లో విఫలమైన తర్వాత సర్ఫరాజ్ జట్టుకు దూరమయ్యాడు. అయినా నిరాశ చెందకుండా తిరిగి జట్టులోకి రావడమే లక్ష్యంగా సాధన కొనసాగించాడు.



అవకాశం కోసం ఎదురుచూస్తూనే తన లోపాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాడు. గత ఏడాదిన్నరలో 17 కిలోల బరువు తగ్గాడు. ముంబయిలో వర్షాల కారణంగా సాధనకు ఇబ్బందులు ఎదురైన సమయంలో కశ్మీర్‌కు వెళ్లాడు. అక్కడి షేర్‌ఏకశ్మీర్ స్టేడియంలో గంటల తరబడి బ్యాటింగ్ సాధన చేశాడు. నెట్ బౌలర్లతో పాటు కశ్మీర్ ఆటగాళ్ల బౌలింగ్‌ను ఎదుర్కొంటూ తన బ్యాటింగ్‌ను మరింత పదును పెట్టుకున్నాడు. ముంబయికి తిరిగొచ్చిన తర్వాత కూడా సాధనకు విరామం ఇవ్వలేదు. బీకేసీలోని ఎంసీఏ ఇండోర్ కేంద్రంలో ప్రత్యేక పిచ్‌లపై బ్యాటింగ్ చేశాడు. కుర్లాలోని ప్రైవేట్ మైదానాల్లో ఎర్ర మట్టి పిచ్‌లపై సాధన చేస్తూ ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు తన ఆటను మెరుగుపరుచుకున్నాడు. ప్రస్తుతం భారత జట్టులో స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొనే బ్యాటర్లలో సర్ఫరాజ్ ఒకడిగా గుర్తింపు పొందాడు. సాధారణ స్వీప్‌తో పాటు రివర్స్ స్వీప్‌ను కూడా సమర్థంగా ఆడగలడు. శ్రీలంక పిచ్‌లపై స్పిన్నర్లను ఎదుర్కొనే సమయంలో ఈ నైపుణ్యాలు అతడికి ఉపయోగపడే అవకాశం ఉంది. ఇటీవల ఇంగ్లండ్ లయన్స్‌తో భారత్‌ఏ తరపున ఆడిన మ్యాచ్‌లో సర్ఫరాజ్ 92 పరుగులు చేశాడు. అనంతరం బెక్హామ్‌లో జరిగిన అంతర్గత జట్టు సాధన మ్యాచ్‌లోనూ శతకం సాధించాడు. దీంతో ఇప్పుడు భారత జట్టులోకి తిరిగి వచ్చిన అతడికి తన సత్తాను నిరూపించుకునేందుకు మరో కీలక అవకాశం దక్కింది. ఈసారి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని సర్ఫరాజ్ పట్టుదలగా ఉన్నాడు.

## షమీకి తలుపులు మూసుకుపోయాయా?

**జాతీయ జట్టులోకి రావాలంటే ఇదే మార్గమన్న జహీర్**
**గాయాల సమస్యపై కీలక వ్యాఖ్యలు**

**స్పోర్ట్స్ డెస్క్ :**
టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమీ భవిష్యత్తుపై చర్చ కొనసాగుతోంది. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని యువ ఆటగాళ్లకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని సెలక్టర్లు భావిస్తున్నట్లు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ చేసిన వ్యాఖ్యలు షమీ పునరాగమనంపై సందేహాలు పెంచాయి. గతంలో భారత జట్టుకు విలువైన సేవలు అందించిన సీనియర్ ఆటగాళ్ల కంటే.. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యువ క్రికెటర్లకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అగార్కర్ సంకేతాలిచ్చాడు. ఈ నేపథ్యంలో షమీ తిరిగి జాతీయ జట్టులోకి వచ్చే అవకాశాలు తగ్గిపోయాయనే చర్చ మొదలైంది. దీంతో అతడి అంతర్జాతీయ కెరీర్‌పై కూడా ఊహాగానాలు సాగుతున్నాయి. అయితే మరోవైపు జస్‌ప్రీత్ బుమ్రా తరచూ



గాయాల కారణంగా సిరీస్‌లకు దూరమవుతుండటం భారత జట్టు ఆందోళనను పెంచుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో షమీ అనుభవం జట్టుకు ఉపయోగపడుతుందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మాజీ భారత పేసర్ జహీర్ ఖాన్ మాత్రం షమీ తన ప్రయత్నాలను ఆపకూడదని సూచించాడు. జాతీయ జట్టులోకి ఎంపిక కావడం లేదనే నిరాశను పక్కనపెట్టి.. మ్యాచ్‌లు ఆడుతూ అత్యుత్తమ ప్రదర్శన చేయడంపైనే దృష్టి పెట్టాలని చెప్పాడు. ప్రస్తుతం జట్టు ఆలోచన ఎలా ఉన్నప్పటికీ.. ఆటగాడిగా తాను జట్టుకు ఏ విధంగా ఉపయోగపడగలనన్నదే ముఖ్యమని పేర్కొన్నాడు. మ్యాచ్‌లు ఆడుతూ రాణిస్తే జాతీయ జట్టు తలుపులు తెరుచుకునే అవకాశం ఉంటుందని జహీర్ అభిప్రాయపడ్డాడు. ఇదే సమయంలో భారత ఆటగాళ్ల గాయాలపైనా జహీర్ స్పందించాడు. క్రికెట్‌లో గాయాలు సహజమేనని, ప్రతి ఆటగాడి ప్రయాణంలో అవి భాగమని చెప్పాడు. ఆటగాళ్ల పని భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించాడు. ముఖ్యంగా పేసర్లు గాయపడినప్పుడు లేదా క్లిష్ట దశను ఎదుర్కొంటున్నప్పుడు నియంత్రణలో ఉన్న అంశాలపై దృష్టి పెట్టాలని పేర్కొన్నాడు. ప్రస్తుతం బుమ్రాతో పాటు వాషింగ్టన్ సుందర్, సాయి సుదర్శన్, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య వంటి ఆటగాళ్లు ఫిట్‌నెస్ సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో షమీ తన ఫామ్‌ను కొనసాగిస్తూ దేశవాళీ, ఇతర పోటీల్లో రాణిస్తే జాతీయ జట్టులోకి పునరాగమనానికి అవకాశం ఉంటుందా అన్నది ఆసక్తికరంగా మారింది.




# కపాలిలో హన్సిక ఫస్ట్ లుక్ విడుదల

నారా రోహిత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కపాలి'. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే డిఫరెంట్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను దర్శకుడు రామ్ గన్ని రూపొందిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా హన్సిక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది. మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్‌ను ఎంతో క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. హన్సిక ముఖాన్ని బ్లాక్ అండ్ వైట్ హ్యాండ్ స్కెచ్ తరహాలో చూపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్, సీరియస్ లుక్ చూస్తుంటే సినిమాలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉన్నట్లు అనిపిస్తోంది. సాధారణమైన దుస్తులతో, మెడలో చిన్న చైన్‌తో కనిపిస్తున్న హన్సిక చూపుల్లో ఏదో తెలియని రహస్యం దాగి ఉన్నట్లుగా పోస్టర్‌ను రూపొందించారు. హన్సిక ముఖంతో పాటు పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అంశాలు కూడా సినిమా కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రాచీన కాలానికి చెందినట్లుగా కనిపించే కొన్ని గుర్తులు, వింతైన సింబల్స్ పోస్టర్ చుట్టూ కనిపిస్తున్నాయి. మరోవైపు చీకటి అడవిలో భారీ చెట్ల మధ్య నుంచి సూర్యకాంతి ప్రసరించేలా రూపొందించిన విజువల్ కూడా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అడవిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి నీడ పోస్టర్‌లో మరింత సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తోంది. దీంతో 'కపాలి' కేవలం సాధారణ హారర్ కథ కాకుండా.. మిస్టరీ, సైకాలజీ, సస్పెన్స్ అంశాలతో కూడిన డార్క్ థ్రిల్లర్‌గా ఉండబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. సాధారణంగా కనిపించే దెయ్యాలు, భయపెట్టే సన్నివేశాలకే పరిమితం కాకుండా.. అంతుచిక్కని చీకటి ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లేలా 'కపాలి' కథ ఉండబోతున్నట్లు ఫస్ట్ లుక్ చూస్తే అర్థమవుతోంది. కనిపించని శక్తులు, పురాతన గుర్తులు, మిస్టరీ అంశాల చుట్టూ కథ నడుస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళ్యాణ చక్రవర్తి మంథినా, భాను కిరణ్ ప్రతాప నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. విజయ్ కృష్ణ లింగమనేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. విజువల్‌గా కూడా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది.

# వారణాసి హన్మంతుడిగా రామ్‌చరణ్?



దర్శకధీరుడు రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్‌బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'. 'ఆర్ఆర్ఆర్'తో అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన తర్వాత రాజమౌళి రూపొందిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు తగ్గట్టుగానే సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన మల్టీస్టారర్ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ చిత్రంగా రూపొందుతున్న 'వారణాసి'లో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ స్థాయిలో అడ్వెంచర్, యాక్షన్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పలు కాలాలను, విభిన్న ప్రపంచాలను కలిపి రాజమౌళి సరికొత్త అనుభూతిని అందించబోతున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. 'వారణాసి' కథలో త్రేతాయుగానికి సంబంధించిన కీలకమైన ఎపిసోడ్ ఉంటుందని, ఆ భాగంలో మహేశ్‌బాబు శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారని ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వచ్చింది. శ్రీరాముడి పాత్రలో మహేశ్‌బాబు కనిపించే ఎపిసోడ్‌లో హనుమంతుడిగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మొదట హనుమంతుడి పాత్ర కోసం మరో నటుడి పేరు వినిపించినప్పటికీ, ఈ పాత్రకు కావాల్సిన పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్ దృష్ట్యా రామ్ చరణ్ అయితే మరింత ప్రభావవంతంగా ఉంటుందని రాజమౌళి భావిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. 'ఆర్ఆర్ఆర్'లో అల్లూరి సీతారామరాజుగా చరణ్‌ను అద్భుతంగా ఆవిష్కరించిన రాజమౌళి.. క్లైమాక్స్‌లో ఆయనను రాముడి రూపంలో చూపించిన విధానం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు అదే దర్శకుడు 'వారణాసి'లో చరణ్‌ను హనుమంతుడి పాత్రలో చూపిస్తే అది సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా మారుతుందని అభిమానులు భావిస్తున్నారు.

# ఇంద్రపుత్రగా కిరణ్ అబ్బవరం




యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళు‌తున్నారు. ఇటీవల ఆయన నటించిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి రెస్పాన్స్ అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా సత్తా చాటుతోంది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న కిరణ్.. మరోవైపు భారీ స్థాయిలో తెరకెక్కనున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కిరణ్ అబ్బవరం ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్ భాగస్వామ్యంతో ఓ భారీ బడ్జెట్ మైథలాజికల్ సినిమాలో నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కీలక వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి 'ఇంద్రపుత్ర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తూ చిత్ర బృందం ఆసక్తిని పెంచింది. పేరు చూస్తేనే ఇది పురాణ, ఇతిహాస నేపథ్యంతో రూపొందనున్న భారీ చిత్రమనే విషయం స్పష్టమవుతోంది. ఈ సినిమాతో శ్రీకాంత్ పుప్పాల దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఆయన గతంలో 'కాంతార చాప్టర్ 1' చిత్రానికి ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ అనుభవాన్ని ఇప్పుడు తన తొలి దర్శకత్వ చిత్రానికి ఉపయోగించుకోనున్నారు. భారీ విజువల్స్, పురాణ నేపథ్యం, విభిన్నమైన కథాంశంతో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రూపొందించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. 'ఇంద్రపుత్ర' రెగ్యులర్ షూటింగ్‌ను అక్టోబర్‌లో ప్రారంభించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌ను పలు భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ సినిమా కేవలం ఒక కథతో ముగిసిపోయే ప్రాజెక్ట్ కాదని తెలుస్తోంది. మేకర్స్ రూపొందించనున్న మైథలాజికల్ యూనివర్స్‌లో 'ఇంద్రపుత్ర' మొదటి అధ్యాయంగా ఉండబోతున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా తర్వాత ఇదే ప్రపంచంలో మరిన్ని కథలు, పాత్రలతో సినిమాలు తెరకెక్కించే అవకాశం ఉంది. ఈ చిత్రాన్ని ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్‌తో కలిసి నిర్మాణ బృందం భారీ స్థాయిలో రూపొందిస్తోంది. కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం కథ, ప్రీ-ప్రొడక్షన్ పనులను పూర్తి చేసే దిశగా చిత్ర బృందం ముందుకు సాగుతోంది.

# మహేశ్ ఏఐ వీడియో షేర్ చేసి వంగా

## కృష్ణ డైలాగ్ మహేశ్ పలికినట్లుగా క్రియేషన్

ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షేర్ చేసిన మహేశ్ బాబు ఏఐ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. సూపర్ స్టార్ పుట్టినరోజు సందర్భంగా అందరూ విషెస్ చెప్పగా.. సందీప్ ఓ ఏఐ వీడియోతో శుభాకాంక్షలు తెలిపారు. దీనికి మహేశ్ కూడా ఫిదా అయ్యారు. దివంగత లెజండరీ నటుడు కృష్ణ 'కిరాయి కోటిగాడు' సినిమాలో చెప్పిన ఐకానిక్ డైలాగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సందీప్ రీక్రియేట్ చేశారు. ఈ వీడియోతో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమాపై గతంలో జరిగిన చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో ప్రచారం పొందిన 'డెవిల్' ప్రాజెక్ట్‌పై సందీప్ హింట్ ఇచ్చారా అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక తనకు బర్త్‌డే విషెస్ చెప్పిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ మహేశ్ పోస్ట్ పెట్టారు. 'వారణాసి' తనకెంతో ప్రత్యేకమైన చిత్రమని పేర్కొన్నారు. ఆ సినిమా విడుదల కోసం తానెంతో ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అభిమానులంతా గర్వపడేలా 'వారణాసి' ఉంటుందన్నారు.





# 'టాక్సిక్'తో నా సత్తా చూపించా

## 'నీ వల్ల కాదు' అన్నవారికి సినిమా పూర్తిచేసి సమాధానం చెప్పా: గీతూ



'టాక్సిక్' సినిమా ప్రారంభించినప్పుడు "నీ వల్ల కాదు" అంటూ చాలామంది తనను నిరుత్సాహపరిచారని, ఇప్పుడు చిత్రాన్ని విజయవంతంగా పూర్తి చేసి తన సత్తా ఏమిటో చూపించానని దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ భావోద్వేగానికి గురయ్యారు. తనపై నమ్మకం ఉంచి ఇంత భారీ చిత్రానికి అవకాశం ఇచ్చిన హీరో యశ్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటానని చెప్పారు. యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'టాక్సిక్' ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదల సమీపిస్తున్న నేపథ్యంలో తాజాగా చిత్ర ప్రచార వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గీతూ తన సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. 'టాక్సిక్' ప్రారంభించిన సమయంలో తన సామర్థ్యంపై పలువురు సందేహాలు వ్యక్తం చేశారని తెలిపారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఇలాంటి చిత్రాన్ని తాను పూర్తి చేయలేనని వ్యాఖ్యానించినవారూ ఉన్నారని గుర్తుచేసుకున్నారు. అయితే ఆ విమర్శలను పట్టించుకోకుండా ముందుకు సాగానని, చివరకు అనుకున్న విధంగా సినిమాను పూర్తి చేయగలిగానని చెప్పారు. తనపై పూర్తి నమ్మకం ఉంచి 'టాక్సిక్'కు అంగీకరించిన యశ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తన సామర్థ్యాన్ని నమ్మి వెన్నుదన్నుగా నిలిచినందుకు ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటానని గీతూ పేర్కొన్నారు. భారీ అంచనాల మధ్య రూపొందిన 'టాక్సిక్'తో యశ్ మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో సినిమాపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా విడుదలైన ప్రచార చిత్రంతో ఆ అంచనాలు మరింత పెరిగాయి.

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644